జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | మంగళవారం 29 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 231 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా

# తెలుగోళ్లు, భారతీయులే




- స్టార్టప్ కంపెనీల కోసం వి-లాంచ్ పాడ్ 2025ని చంద్రబాబు
- "అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశా.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నా
- ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేది
- ఇప్పుడు కలెక్టర్ పోస్టు కంటే ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉంది.
- భారత్ జోలికి ఎవరైనా వస్తే మటాష్ అయిపోతారు..

**అమరావతి**

హైదరాబాద్‌లో 14 నెలల్లోనే గతంలో హైటెక్ సిటీ పూర్తి చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. భవిష్యత్ అంతా ఐటీదేనని అప్పట్లో తల్లిదండ్రులకు పిలుపునిచ్చామని చెప్పారు. స్టార్టప్ కంపెనీల కోసం వి-లాంచ్ పాడ్ 2025ని చంద్రబాబు ఆవిష్కరించారు. అమరావతిలోని విట్ వర్సిటీలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశా.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నా. ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేది. ఇప్పుడు కలెక్టర్ పోస్టు కంటే ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉంది. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్లు వస్తున్నాయి. మీరు ఉద్యోగంలో సంతృప్తి చెందవద్దు.. కొత్త సంస్థలు స్థాపించండి. సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా - మిగతా3లో



## పాక్ గుండెల్లో

# గుబులు

- ఉగ్రవాదులను తరలిస్తున్న దాయాది సైన్యం?
- పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం
- ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి
- 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారు



## పార్టీ మార్గదర్శకాలను

# కట్టుబడి ఉండాలి

- పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్యతోపాటు ఆయన కేబినెట్‌లోని మరో మంత్రి కీలక వ్యాఖ్యలు
- దిద్దుబాటు చర్యలకు దిగిన కాంగ్రెస్ అధిష్ఠానం
- అంతేకానీ.. ఎవరి నిర్ణయాలు వారు బాహాటంగా చెప్పకూడదని సూచన
- పహల్గాం దాడి ఘటనపై భవిష్యత్తులో పార్టీ చేసే ప్రకటనకు నిబద్ధతో కట్టుబడి ఉండాలని నాయకులకు ఆదేశం

## కూటమిలో

# కొలువుల జాతర



ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం

10 జిల్లాలకు సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాల (డీసీఎంఎస్) ఛైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ

**అమరావతి**

ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. 10 జిల్లాలకు సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాల (డీసీఎంఎస్) ఛైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం డీసీసీబీ ఛైర్మన్‌గా శివ్వల సూర్యనారాయణ (తెదేపా), విశాఖ డీసీసీబీ ఛైర్మన్‌గా కోన తాతారావు (జనసేన) నియమితులయ్యారు.

డీసీసీబీ ఛైర్మన్లు వీళ్లే..
విజయనగరం - కిమిడి నాగార్జున (తెదేపా)
గుంటూరు - మాకినేని మల్లికార్జునరావు (తెదేపా)
కృష్ణా - నెట్టెం రఘురామ్ (తెదేపా)
నెల్లూరు - ధనుంజయరెడ్డి (తెదేపా) - మిగతా3లో



## తిరుపతి జిల్లాలో

# ఘోర రోడ్డు ప్రమాదం

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు
ఐదుగురి మృతి
మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి
మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు



## సంయమనం

# పాటించండి

- ఇండియా, పాక్‌ను కోరిన చైనా
- ఒకర్ని ఒకరు కలుసుకుని.. చర్చల ద్వారా విభేధాలను పరిష్కరించుకోవాలి
- ప్రాంతీయ స్థిరత్వాన్ని, శాంతిని నెలకొల్పాలి
- ఉద్రిక్త పరిస్థితుల్ని చల్లార్చే ఎటువంటి చర్యనైనా స్వాగతిస్తాం
- చైనా విదేశాంగ ప్రతినిధి గువో జాయికున్

## ఏపీ రాజ్యసభ స్థానానికి

# అభ్యర్థి ఖరారు

బీజేపీ నేత, భీమవరానికి చెందిన పాక వెంకటసత్యనారాయణ ఎంపిక
విజయసాయిరెడ్డి రాజీనామాతో ఈ సీటు ఖాళీ అయిన సంగతి తెలిసిందే
తొలుత తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలైకు అవకాశం దక్కవచ్చనే ప్రచారం



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ స్థానానికి అభ్యర్థి ఖరారు అయ్యారు. బీజేపీ నేత, భీమవరానికి చెందిన పాక వెంకటసత్యనారాయణను ఎంపిక చేసింది ఆ పార్టీ. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. కూటమి అభ్యర్థిగా రేపు ఆయన నామినేషన్ వేయబోతునున్నారు. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఈ సీటు ఖాళీ అయిన సంగతి తెలిసిందే. తొలుత తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలైకు అవకాశం దక్కవచ్చనే ప్రచారం జరిగింది. చివరకు ఏపీ నేతకే ఆ అవకాశం దక్కింది. ప్రస్తుతం ఏపీ బీజేపీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు పాక వెంకటసత్యనారాయణ.



## ఉగ్రవాదాన్ని వీడేవరకూ

# ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలి

- మోదీతో రాజ్‌నాథ్ భేటీ..
- భారత సైన్యం, సరిహద్దు భద్రతపై చర్చ!
- సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలి
- సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటన
- తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడి

## మార్చి నాటికి బందరు ఫిషింగ్

# హార్బర్ నిర్మాణం పూర్తి

- ఫిషింగ్ హార్బర్ పూర్తి చేయాలనే లక్ష్యంతో కాల పరిమితిని వరుసగా రెండో సారి పొడిగించామని
- గత ప్రభుత్వ హయాంలో ఫిషింగ్ హార్బర్ పనులు నిలిచిపోయాయి
- ఈ హార్బర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే ఆలోచనతో దాదాపు రూ.422 కోట్లతో ఈ నిర్మాణం చేపట్టడం జరిగింది



**మచిలీపట్నం**

2026, మార్చి నాటికి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేసి..ప్రజలకు అంకితం చేస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ పూర్తి చేయాలనే లక్ష్యంతో కాల పరిమితిని వరుసగా రెండో సారి పొడిగించామని ఆయన తెలిపారు. సోమవారం మచిలీపట్నంలోని ఫిషింగ్ హార్బర్ పనులను మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ పరిశీలించారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఫిషింగ్ హార్బర్ పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. ఈ హార్బర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే ఆలోచనతో దాదాపు రూ.422 కోట్లతో ఈ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే ఈ హార్బర్ పనులు దాదాపు 57 శాతం పూర్తయ్యాయని వివరించారు. కానీ కొన్ని కీలకమైన పనుల్లో - మిగతా3లో

# పార్టీ మార్గదర్శకాలను కట్టుబడి ఉండాలి

**న్యూఢిల్లీ :** పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో విపక్ష కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమవుతోన్నాయి. ఆ నాయకుల వ్యాఖ్యల కారణంగా.. ఆ పార్టీ తీవ్ర విమర్శల ఎదుర్కొవలసి వస్తుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్పందించింది. పార్టీ మార్గదర్శకాలను కట్టుబడి ఉండాలని నేతలకు స్పష్టం చేసింది. అందుకు భిన్నంగా వ్యాఖ్యలు చేయవద్దంటూ పార్టీ నేతలకు అధిష్టానం క్లియర్ కట్‌గా సూచించింది. ఈ మేరకు పార్టీ అధిష్టానం సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది.
పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతోపాటు ఆయన కేబినెట్‌లోని మరో మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. ఆ క్రమంలో ఈ దాడులపై పార్టీ వైఖరిపై సర్వత్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని నేతలకు స్పష్టం చేసింది. అంతేకానీ.. ఎవరి నిర్ణయాలు వారు బాహటంగా చెప్పకూడదని సూచించింది. పహల్గాం దాడి ఘటనపై భవిషత్తులో పార్టీ చేసే ప్రకటనకు నిబద్ధతో కట్టుబడి ఉండాలని నాయకులను ఆదేశించింది. ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఐదు నుంచి ఆరుగురు తీవ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 26 మంది మరణించారు. ఈ ఉగ్రదాడితో దేశం యావత్తు ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఈ నేపథ్యంలో భారత్



పాకిస్థాన్ మధ్య సంబంధాలు క్షీణించాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలు ఉప్పు నిప్పుగా మారాయి.

**వివాదాస్పద వ్యాఖ్యలు**

పాకిస్తాన్‌తో యుద్ధం అవసరం లేదని, దీనికి బదులుగా భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కోరారు. ఈ వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. దీంతో ఆయన స్పందించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు. అనివార్యమైతే.. పాకిస్థాన్‌పై భారత్ యుద్ధం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలి

**ఢిల్లీ:** పహల్గాం దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని మోదీతో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. ఇక.. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ కూడా పాల్గొన్నారు. మరోవైపు.. రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా సోమవారం భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి ఘటనతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన భారత్.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే పాక్ జాతీయులను వారి దేశానికి పంపించింది. మరోవైపు.. నియంత్రణ రేఖ వెంట ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించే పాక్.. కొన్నేళ్లుగా రూటు మార్చిందని నిఘా వర్గాలు జాతీయ మీడియాకు వెల్లడించాయి. ఆన్‌లైన్ వేదికగా కశ్మీరీ యువతను ఆకర్షించి, తమ భావజాలం వైపు మొగ్గు చూపిన వారికి సరైన పత్రాలతో వీసాలిచ్చి పాక్‌లోకి తీసుకెళ్తోందని పేర్కొన్నాయి. తీవ్రవాద భావజాలం ఉన్న వ్యక్తులను ఎంపిక చేసుకోవడంతో పాటు ఆయుధాలు వాడగల, దాడులు నిర్వహించగల సామర్థ్యం ఉన్నవారిని తమవైపు ఆకర్షిస్తోందని చెప్పాయి.
కొన్నేళ్లలో ఇలా 300 మందికి పైగా కశ్మీర్ యువత అధికారిక ప్రయాణ పత్రాలతో పాక్‌కు ప్రయాణించారని పలు కథనాలు వెల్లడించాయి. వీరిలో పలువురు నిషేధిత ఉగ్రవాద శిబిరాల్లో శిక్షణ పొందుతున్నారు. తర్వాత ఉగ్రసంస్థల్లో చేరి,



సరిహద్దు ద్వారా అక్రమంగా చొరబాట్లకు పాల్పడతారు. అనంతరం జమ్ముకశ్మీర్‌లోని పౌరులు, భద్రతా దళాలపై ఉగ్రదాడులు చేస్తారు. అయితే ఇలా చొరబాట్లకు పాల్పడినవారిలో 15 మంది ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. ప్రస్తుతం ఇలా శిక్షణ పొందిన తొమ్మిది మంది క్రియాశీలకంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్నారని సమాచారం. వారిలో కొందరు పాకిస్తాన్‌లో ఉండి, మరికొందరు కశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు సహకారం అందిస్తున్నారు.

**పాక్‌కు సైనిక విమానాలు..**

పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా టర్కీకి చెందిన పలు సీ-130 హెర్క్యులస్ విమానాలు పాక్‌లో ల్యాండ్ అయ్యాయి. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో, భారత్ కూడా అలర్ట్ అయ్యింది.

# భారత నావికాదళంలోకి రఫేల్ యుద్ధ విమానాలు

భారత సైనిక దళాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్ దేశంతో భారత్ ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ ఒప్పందంపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ భారీ ఒప్పందం విలువ 7.6 బిలియన్ డాలర్లు. అంటే భారత కరెన్సీలో రూ.64,000 కోట్లన్నమాట. ఒప్పందంలో భాగంగా భారత నావికాదళానికి ఫ్రాన్స్ నుంచి 22 సింగిల్ సీటర్, నాలుగు టు సీటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు రానున్నాయి. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రాన్స్ ప్రభుత్వమే చూసుకుంటుంది. వాయుదళ శక్తిని పటిష్టం చేసే లక్ష్యంతో రఫేల్ యుద్ధ విమానాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. శక్తివంతమైన ఆధునిక ఆయుధ వ్యవస్థలను కలిగి ఉండే రఫేల్ యుద్ధ విమానాలు భారత నౌకాదళ పోరాట శక్తిని బలోపేతం చేయనున్నాయి. నాలుగేళ్లలో రఫేల్ యుద్ధ విమానాల సరఫరా ప్రారంభమయ్యే అవకాశం ఉందని



ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇక ఒప్పందం ప్రకారం.. తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని.. 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయి.


# పాక్ గుండెల్లో గుబులు..

**ఇంటర్నెట్‌డెస్క్:** పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది. భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ



జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతో పాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.

## తెలుగు రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు ఎన్నంటే..?




దేశంలో వక్ఫ్(సవరణ) చట్టం-2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. విపక్షాల అభ్యంతరాలను తోసిరాజని ఈ సవరణ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లు అమల్లోకి వచ్చింది. అయితే వక్ఫ్(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పలు పార్టీలతో పాటు మైనారిటీ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నాయి. మరోవైపు ఈ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఏయే రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు ఎన్నున్నాయే దానిపై కేంద్రం తాజాగా ప్రకటన చేసింది. దేశంలో వక్ఫ్ ఆస్తులు అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలున్నాయని తెలిపింది. దేశంలో వక్ఫ్‌కు సంబంధించి 8,72,352 స్థిరాస్తులు, 16,713 చరాస్తులు ఉన్నాయని ప్రకటించింది. అలాగే ఇప్పటివరకు 994 వక్ఫ్ ఆస్తులను ఇతర అవసరాలకు కేటాయించినట్లు వివరించింది. ఉత్తరప్రదేశ్‌లో సున్నీల స్థిరాస్తులు 2,17,161, షియాల స్థిరాస్తులు 15,386 ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో 14,685 స్థిరాస్తులు, 85 చరాస్తులున్నట్లు తెలిపింది. తెలంగాణలో 45,682 స్థిరాస్తులు ఉన్నట్టు ప్రకటించింది.

## సంయమనం పాటించండి



**న్యూఢిల్లీ:** ఇండియా, పాకిస్థాన్ దేశాలు సంయమనం పాటించాలని డ్రాగన్ దేశం చైనా కోరింది. పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రస్తుతం ఇండియా, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. మరో వైపు కొన్ని రోజుల నుంచి నియంత్రణ రేఖ వద్ద ఇరు దేశాల బలగాలు ఫైరింగ్‌కు పాల్పడితున్నాయి. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగ ప్రతినిధి గువో జాయికున్ మీడియాతో మాట్లాడుతూ ఈ అభ్యర్థన చేశారు. ఇరు దేశాలు సంయమనం పాటిస్తాయని ఆశిస్తున్నామని, ఒకర్ని ఒకరు కలుసుకుని.. చర్చల ద్వారా విబేధాలను పరిష్కరించుకోవాలని, ప్రాంతీయ స్థిరత్వాన్ని, శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నట్లు చైనా ప్రతినిధి జాయికున్ తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల్ని చల్లార్చే ఎటువంటి చర్యనైనా స్వాగతిస్తామని చైనా పేర్కొన్నది. ఏప్రిల్ 22వ తేదీన జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు కొత్త ఉద్రిక్తతలకు దారి తీశాయి. నాలుగు ఏళ్ల తర్వాత మళ్లీ ఇండో, పాక్ బోర్డర్ వద్ద కాల్పులు ఘటనలు జరిగాయి. ఇక పెహల్గామ్ దాడికి తామే కారణమని చెప్పుకున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్.. ఇప్పుడు ఆ ఘటనతో తమకు బాధ్యత లేదని చెప్పుకున్నది. ఉగ్రదాడి ఘటనపై తటస్థ విచారణకు సహకరించాలని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ ఫరీఫ్ కోరారు. భారత్ మాత్రం ప్రతీకార చర్యగా సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. కశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఇండ్లను కూల్చివేస్తోంది.

## వారి ప్రాణాలను అడ్డంపెట్టుకుని రాష్ట్ర హెూదా అడగబోను : జమ్ముకశ్మీర్ సీఎం





పహల్గాంలో అతిథులను కాపాడుకోవడంలో తాను విఫలమయ్యానని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా ఆయన ప్రకటన చేశారు. అయితే ఆ 26 మంది ప్రాణాలను అడ్డంపెట్టుకొని తాను రాష్ట్రహెూదాను డిమాండ్ చేయబోనని ఆయన హామీ ఇచ్చారు. జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు ఆ డిమాండ్ సరికాదని, మరేదైనా రోజు ఆ డిమాండ్ లేవనెత్తుతానని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు జమ్ముకశ్మీర్ అసెంబ్లీ సోమవారం అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. 'ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పని చేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయి' అని అన్నారు. పహల్గాం దాడి తర్వాత తాపే ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రహెూదా కోసం డిమాండ్ చేయాలని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదని చెప్పారు. గతంలో రాష్ట్రహెూదా అడిగామని, భవిష్యత్తులో కూడా అడుగుతామని అన్నారు. కానీ, ఇప్పుడు 26 మంది అమాయకులు చనిపోయారని, ఇలాంటి సమయంలో రాష్ట్ర హెూదా ఇవ్వండని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ప్రజలు తమకు మద్దతిస్తే తీవ్రవాదం, ఉగ్రవాదం అంతమవుతాయని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఇది అందుకు ఆరంభమని చెప్పారు. ఈ ఉద్యమానికి హాని కలిగించేది ఏదీ మాట్లాడకూడదు, చేయకూడదని అన్నారు. తాము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలమని, కానీ, తమకు ప్రజల మద్దతు అవసరమనిని అబ్దుల్లా అసెంబ్లీలో చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పర్యాటక శాఖ మంత్రిగా తాను వారిని కాపాడలేకపోయానని అన్నారు. కాగా ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపారు. ఒక్కొక్కరిని మతం అడిగి మరీ ఈ దారుణానికి ఒడిగట్టడం సంచలనంగా మారింది. మృతుల్లో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ ఉన్నారు.

# ఏపీ బీజేపీకి కొత్త ఛీఫ్



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో నాయకత్వ సమస్య ఇబ్బందికరంగా మారినట్లు కనిపిస్తుంది. కేవలం టీడీపీ, జనసేనతో కలసి పోటీ చేయడం వల్లనే ఆ మాత్రం నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచింది. లేకుంటే ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ బలం ఒక్క శాతం ఓట్లు మాత్రమే. అంటే దీనికి ప్రధాన కారణం నాయకత్వ లేమి అని కేంద్ర నాయకత్వం కూడా నిర్ధారణకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటి నుంచే కాదు.. తొలి నుంచి ఈ సమస్య ఉంది. టీడీపీతో జట్టుకడితేనే నాలుగు స్థానాలు సాధించి ఇటు శాసనసభలోనూ, అటు పార్లమెంటులోనూ కమలం పార్టీ అడుగు పెడుతుంది. పేరున్న నేతలున్నప్పటికీ వారు రాష్ట్ర స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయగలవారు ఎవరూ లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని చెప్పకతప్పదు.ఎవరి ప్రభావం... గత ఎన్నికల్లో పురంద్రీశ్వరి పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ ఆమె ప్రభావం పనిచేసింది తక్కువేనని చెప్పాలి. 2019 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసినప్పుడు పురంద్రీశ్వరి ఎన్టీఆర్ కుమార్తె అయినప్పటికీ విశాఖలో ఓటమి పాలయ్యారు. సో.. పురంద్రీశ్వరి అయినా... అంతకు ముందు సోము వీర్రాజు అయినా.. ఆ ముందు కన్నా లక్ష్మీనారాయణ అయినా పార్టీ ఓటు బ్యాంకును పెంచే ప్రయత్నం చేయలేదు. అంటే వారికి అంతా సత్తా లేదు. మోదీ చరిష్మా కూడా ఏపీలో పెద్దగా పనిచేయకపోవడంతో ఇతర పార్టీల పైన ఆధారపడి గెలవాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. సామాజికవర్గాల వారీగా, ఆస్తుల పరంగా చూసినా అంతే. ఏ మాత్రం పనిచేయదన్నది గత కొన్ని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. అయితే ఇప్పుడు పురంద్రీశ్వరిని మార్చాలని కేంద్ర నాయకత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ పదవిని ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే ఎవరికి ఇచ్చినా ఒరిగేదేమీ లేదన్న సంగతి తెలిసినా పార్టీని కొంతైనా ఊపు కలిగించేలా తీసుకెళ్లే నేత కోసం కేంద్ర నాయకత్వం అన్వేషిస్తుందని తెలిసింది. పురంద్రీశ్వరికి పదోన్నతి ఇచ్చి ఇక్కడ బీజేపీ అధ్యక్షుడిగా సుజనా చౌదరిని నియమిస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది. సుజనా చౌదరి అయితే ఆర్థికంగా బలవంతుడు కావడంతో ఆయనకు పదవి ఇస్తే పార్టీ కార్యక్రమాలను విరివిగా నిర్వహించే అవకాశముందని ఆయనను ఎంపిక చేస్తారన్నది కూడా గత కొంతకాలంగా వినపడుతుంది. . కానీ పురంద్రీశ్వరి, సుజనా చౌదరి ఒకే సామాజికవర్గం కావడంతో ఈసారి బీసీలకు పదవి ఇవ్వాలని డిమాండ్ వినపడుతుంది. జనసేనలో కాపు సామాజికవర్గానికి చెందిన పవన్ కల్యాణ్ అధినేతగా ఉండగా, టీడీపీకి చంద్రబాబు ఉన్నారు. ఈ రెండు సామాజికవర్గాలు కాకుండా బీసీలకు అప్పగిస్తే ఆ ఓటు బ్యాంకును తెచ్చుకునేందుకు అవకాశముంటుందని భావిస్తున్నారు. మరొకవైపు రెడ్డి సామాజికవర్గం నుంచి కూడా కొన్ని పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెబుతున్నారు. అయితే ఎప్పటికప్పుడు కేంద్ర నాయకత్వం ఆలోచనలు మారుతుండటంతో చివరకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారన్నది తేల్చరు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో పార్టీ పదవి ఎవరికిస్తే ఆ సామాజికవర్గం కాకుండా వేరే సామాజికవర్గానికి పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వనున్నారన్న టాక్ బలంగా వినపడుతుంది.

# ఏపీలో 9 రకాల స్కూల్స్




**విజయవాడ :** ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యారంగ సంస్కరణలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన 117 జీవో రద్దు చేసి మొత్తం 9 రకాల బడుల విధానం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ప్రాథమిక జాబితాను రూపొందించారు.కూటమి ప్రభుత్వం విద్యారంగ సంస్కరణలపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ-117ను రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా 9 రకాల పాఠశాలలు తీసుకురాబోతుంది. ఇందుకు సంబంధించి అధికారులు ప్రాథమిక జాబితాను రూపొందించారు. ఇప్పటి వరకు ఉన్న 6 రకాల బడులు స్థానంలో మరో మూడు జోడించి 9 రకాల బడుల విధానం అమలు చేయనున్నారుఉన్నత పాఠశాలలో 4 రకాలు, ప్రాథమిక పాఠశాలల్లో 45 మంది లోపు ఉంటే బేసిక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా పిలుస్తారు. 45 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే తరగతికొక టీచర్‌ను కేటాయిస్తారు. వీటిని ఆదర్శ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా పిలుస్తారు. 1-10 తరగతులుంటే బేసిక్, ఆదర్శ ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 900 వరకు ఏర్పాటు చేయనున్నారు.కొన్ని ప్రాథమికోన్నత స్కూల్స్, ఇంటర్మీడియట్‌తో కలిపి హైస్కూల్ ప్లస్‌లుగా కొనసాగిస్తారు. క్షేత్రస్థాయి పరిస్థితుల కారణంగా 240కి పైగా ప్రాథమికోన్నత బడులను కొనసాగించాలని విద్యాశాఖ నిర్ణయించింది.ముందుగా 5 రకాల బడులను తీసుకురావాలని భావించినప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితుల నేపథ్యంలో మొత్తం 9 రకాలు పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి నూతన బడుల విధానం అమల్లోక రానుంది.

9 రకాల బడులు

అంగన్‌వాడీలను మార్పు చేసి ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్- 1, 2 (ఎల్‌కేజీ, యూకేజీ) బడులను శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్ గా ఏర్పాటు చేస్తారు. వీటిని మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించనుంది.

ప్రీ ప్రైమరీ-1, 2తో పాటు ఒకటి, రెండో తరగతులు కలిపి ఫౌండేషన్ పాఠశాలలుగా పిలుస్తారు.

పీపీ-1, 2తోపాటు 1-5 తరగతులు ఉండే పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూల్స్ గా ఏర్పాటు చేస్తారు. 1-5 తరగతుల్లో 45 మందిలోపు పిల్లలుంటే వాటిని బేసిక్ ప్రైమరీ స్కూల్స్ గా పరిగణిస్తారు.

పీపీ-1, 2, ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఉండి, 45 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా పరిగణిస్తారు.

ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగనున్నాయి. 6, 7, 8 తరగతుల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొన్నింటిని ఉన్నత పాఠశాలలుగా, మరికొన్నింటిని ప్రాథమిక పాఠశాలలుగా పరిగణిస్తారు.

6 నుంచి 10 తరగతులు వరకు ఉన్నత పాఠశాలలు ఉంటాయి.

1-10 తరగతులు ఉంటే బేసిక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుగా పరిగణిస్తారు. జీఓ-117 రద్దుతో 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకొచ్చి వీటికి 1, 2 తరగతులను జోడించారు.

1-10 తరగతులు ఉంటే ఆదర్శ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేసి, ప్రాథమిక బడుల్లో 45 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే తరగతికి ఒక్క ఉపాధ్యాయుడిని కేటాయిస్తారు.

రాష్ట్రంలో మొత్తం 294 హైస్కూల్ ప్లస్‌లు కొనసాగిస్తారు. వీటిల్లో 1-12 లేదా 6-12 తరగతులు ఉంటాయి.

# చేజారుతున్న మున్సిపల్ పీఠాలు

**అనంతపురం :** ఏపీలో ఉన్న మున్సిపల్ పీఠాలన్నీ ఒక్కొక్కటిగా కదిలిపోతూ కూటమిఖాతాలో చేరిపోతున్నాయి. అలా వైసీపీ మున్సిపల్ పీఠాలను చేతులారా చేజార్చుకుంటోంది. అధికారం ఉన్నప్పుడు స్థానిక సంస్థల్లో గెలవడం ఈజీనే అనుకున్న వైసీపీకి..అధికారంలో కోల్పోయిన తర్వాత వాటిని నిలబెట్టుకోవడం కష్టమవుతుందట. రాష్ట్రంలో వరుసగా మున్సిపాల్టీలను చేజార్జుకుంటున్న వైసీపీ..తాజాగా శ్రీసత్యసాయి జిల్లా కదిరి మున్సిపాల్టిని కూడా చేజార్చుకుంది.నిన్నటి వరకు ఇక్కడ తిరుగులేని ఆధిక్యంతో ఉన్న మున్సిపల్ ఛైర్ పర్సన్ నజీమున్నీసా..ఇప్పుడు మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ అయ్యారు. భారీ ఆధిక్యం ఉండి కూడా?వైసీపీ బలహీనతలు, ప్రస్తుతం అక్కడున్న ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ దూకుడు కలగలిపి. కొంపముంచిందన్న టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.కదిరి మున్సిపాల్టీలో 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో వైసిపి 31 స్థానాల్లో గెలవగా, టిడిపి 5 స్థానాల్లో విజయం సాధించింది. సార్వత్రిక ఎన్నికల ముందే వైసిపికి చెందిన ఐదుగురు, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ టిడిపి గూటికి చేరారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్లో టిడిపి బలం 11కి పెరిగింది. వైసిపికి 25 మంది మద్దతు ఉండగా వీరిలో 14మంది తిరుగుబాటు జెండా ఎగురవేశారుదీనికి ప్రధానమైన కారణంగా ఛైర్ పర్సన్ నజీమున్నీసా, ఆమె భర్త వ్యవహార తీరే అని అంతా అనుకుంటున్నారట. ఛైర్ పర్సన్ అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదంటూ సొంత పార్టీ కౌన్సిలర్లే అనేకసార్లు బహిరంగ విమర్శలు చేశారట. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో ఛైర్ పర్సన్ పై మరింత స్వరాన్ని పెంచారట. అంతే కాకుండా ఆమె రెండున్నరేళ్లకు పదవి నుంచి దిగి మరొకరికి అవకాశం ఇవ్వాల్సి ఉంది. కానీ అలా చేయకపోవడంతో స్వపక్షంలోనే విపక్షం తయారైందట. వైసీపీలో ఇంత గందరగోళ పరిస్థితులు ఉంటే ఇక్కడ సమన్వయకర్తగా ఉన్న మక్బూల్ ఏ మాత్రం పట్టించుకోలేదట. ఆయనపై కొన్ని భూ వివాదాలు ఉండడంతో కేసులు కూడా నమోదు కావడంతో అప్పటినుంచి అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారట. సరిగ్గా వైసీపీకి ఉన్న ఈ మైనస్సే కూటమికి బాగా కలిసొచ్చిందట. తెర వెనుక ఎమ్మెల్యే కందికుంటే ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపించారట.కౌన్సిలర్లను క్యాంపుకు తరలించి..పక్కా వ్యూహంతో కథ నడిపించి..చివరకు ఛైర్ పర్సన్ ను దించి వేశారట. మొత్తం 25 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాణానికి హాజరుకాగా..వైసీపీ ఛైర్ పర్సన్ పక్షాన నిలబడిన 11 మంది గైర్హాజరయ్యారు. 25 మంది ఛైర్ పర్సన్ కు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఆమె పదవి నుంచి కోల్పోయారు. అయితే త్వరలోనే మున్సిపల్ ఛైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. వీటిని కూడా కైవసం చేసుకునేందుకు కూటమి పావులు కదుపుతోందట.వైసీపీ వైఫల్యాల కారణంగానే ఇక్కడ ఛైర్ పర్సన్ పీఠం చేజారిందంటూ జిల్లా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే కందికుంట లాంటి బలమైన నేత వేస్తున్న వ్యూహాలు చూసైనా వైసీపీ అధిష్టానం జోక్యం చేసుకొని ఉంటే బాగుండేదన్న టాక్ విన్పిస్తోంది. ఏది ఏమైనా వైసీపీ నుంచి మరో మున్సిపాల్టీ చేజారిపోయింది.ఇప్పటికే రాష్ట్రావ్యాప్తంగా మెజార్టీ మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకున్న కూటమి?రాబోయే రోజుల్లో మిగిలిన మున్సిపల్ పీఠాలను కూడా తన ఖాతాలో కలిపేసుకునేందుకు ఇప్పటినుంచే ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతోందట. మరి మిగిలిన మున్సిపల్ పీఠాలనైనా వైసీపీ కాపాడుకుంటుందా లేక వాటిని కూడా కూటమికి అప్పనంగా అప్పగించేస్తుందా అనేది చూడాలి.

## సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా తెలుగోళ్లు, భారతీయులే

-మొదటిపేజీ తరువాయి

తెలుగోళ్లు, భారతీయులే. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉంటారు. అందులో అగ్రస్థానంలో తెలుగువారు ఉంటారు. త్వరలో అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. మన పిల్లలు ప్రపంచస్థాయి సేవలు అందించే స్థాయికి ఎదగాలి. వాట్సప్ సేవ ద్వారా ప్రజలకు పరిపాలన, ప్రభుత్వ సర్వీసులు దగ్గర చేశాం. వాట్సప్ ద్వారా వెయ్యి రకాల సేవలు అందిస్తున్నాం. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047కి మార్గసూచి రూపొందిస్తున్నాం. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. త్వరలోనే అగ్రగామిగా నిలబడుతుంది. ఉగ్రదాడులు భారత్‌ను ఏమీ చేయలేవు. వారికి తగిన బుద్ధి చెబుతాం. సంఘటితంగా ఉండి దేశాన్ని రక్షించుకునే శక్తి మనకుంది.

**అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలి**

డ్రోన్ సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. ప్రభుత్వ సేవలను ఒకే తాటిమీదకి తెస్తున్నాం. రియల్ టైం డేటాతో సమస్యలకు రియల్ టైం పరిష్కారాలు చూపిస్తున్నాం. పీ4 ద్వారా పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నాం. 20శాతం సంపన్నులు 20శాతం పేదవారిని పైకి తీసుకురావాలి. ఒకప్పుడు జన్మభూమి కోసం చాలా మంది అలా పని చేశారు. ఇప్పుడు మార్గదర్శి, బంగారు కుటుంబం కోసం కలిసి రావాలి. కొత్తగా ఆలోచించడం ద్వారా యువత విజయం సాధించాలి. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తయారు చేయాలి. అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలి. విట్‌లో 50 వేల మంది విద్యార్థులు ఉండాలి. కేవలం ఏపీ విద్యార్థులే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల విద్యార్థులు ఉండాలి. అమరావతిలో 30శాతం పచ్చదనం, నీరుతో నిండి ఉంటుంది. ఇప్పుడున్న వర్సిటీలతోపాటు మరికొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలు వస్తున్నాయి.

**మే 2న ఏపీకి ప్రధాని..**

మే 2న ప్రధాని మోదీ అమరావతికి వస్తున్నారని, ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశానని, ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నానని అన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేదని, ఇప్పుడు ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉందని అన్నారు. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్లు వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. మే 2న ప్రధానమంత్రి మోదీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోంది" అని చంద్రబాబు అన్నారు

## తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**పాకాల:** తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పాకాల మండలం తోటపల్లి వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై వేగంగా వెళ్తోన్న ఓ కారు.. ముందున్న కంటైనర్ కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుల్ని సమీప ఆస్పత్రికి తరలించారు. మృతులను తమిళనాడులోని కృష్ణగిరి వాసులుగా గుర్తించారు. మృతి చెందిన వారిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, దాదాపు 9 ఏళ్ల వయసున్న బాలుడు ఉన్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా భావిస్తున్నారు. ప్రమాద ఘటనతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది.

## కూటమిలో కొలువుల జాతర

-మొదటిపేజీ తరువాయి

చిత్తూరు - అమాస రాజశేఖర్‌రెడ్డి (తెదేపా)
అనంతపురం - కేశవరెడ్డి (తెదేపా)
కర్నూలు - డి.విష్ణువర్ధన్‌రెడ్డి (తెదేపా)
కడప - బి.సూర్యనారాయణ రెడ్డి (తెదేపా)
డీసీఎంఎస్ ఛైర్మన్లు వీళ్లే..
శ్రీకాకుళం - అవినాష్ ఛౌదరి (తెదేపా)
విశాఖ - కొట్ని బాలాజీ (తెదేపా)
విజయనగరం - గొంప కృష్ణ (తెదేపా)
గుంటూరు - వడ్రాణం హరిబాబు (తెదేపా)
కృష్ణా - బండి రామకృష్ణ (జనసేన)
నెల్లూరు - గొనుగోడు నాగేశ్వరరావు (తెదేపా)
చిత్తూరు - సుబ్రమణ్యం నాయుడు (తెదేపా)
అనంతపురం - నెట్టెం వెంకటేశ్వర్లు (తెదేపా)
కర్నూలు - జి.నాగేశ్వరయాదవ్ (తెదేపా)
కడప - యర్రగుండ్ల. జయప్రకాశ్ (తెదేపా)

## మార్చి నాటికి బందరు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి

-మొదటిపేజీ తరువాయి



జాప్యం జరిగిందని చెప్పారు. దాదాపు రూ.3500 కోట్లతో ఈ తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను పూర్తి చేస్తున్నామని వివరించారు. ఈ హార్బర్ పూర్తయిన అనంతరం ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్ తీర్చిదిద్దాలని మంత్రి కొల్లు రవీంద్ర కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాతే ఫిషింగ్ హర్బర్ పనులు వేగంగా ముందుకు కదులుతున్నాయని స్పష్టం చేశారు. ఆ క్రమంలోనే పోర్టులు,ఫిషింగ్ హార్బర్ల పురోగతిపై తాము ప్రతీ నెలా సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని మంత్రి వివరించారు. ఇక సీ మౌత్ సమస్యను టెక్నికల్‌గా పరిష్కరించేందుకు చెన్నైకి పంపించాం.. అది మరో 45 రోజుల్లో వస్తోందన్నారు. ఆది వచ్చిన తర్వాత సీ మౌత్‌ను సైతం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మచిలీపట్నంలోని జిల్లా కలెక్టరేట్‌లో ప్రధాని పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై మంత్రులు వంగలపూడి అనిత,కొల్లు రవీంద్ర,బిసి జనార్ధన రెడ్డి,వాసంశెట్టి సుభాష్‌తోపాటు జిల్లాలకు చెందని ఎమ్మెల్యేల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, బిసి జనార్ధన రెడ్డి మాట్లాడుతూ.. మే 2వ తేదీన జరిగే అమరావతి నిర్మాణ పునఃప్రారంభ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయనున్నారన్నారు. జగన్ మూడు రాజధానుల పేరుతో అమరావతిపై కుట్రలు చేశారని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షల మేరకు మళ్లీ అమరావతి పనుల్ని వేగవంతం చేస్తున్నామన్నారు. రాష్ట్ర నాలు మూలాల నుండి ప్రజలు పెద్దఎత్తున ప్రధాని కార్యక్రమానికి తరలి రానున్నారన్నారు. కృష్ణా జిల్లా నుండి లక్ష మంది జనం వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. సభకు విచ్చేసిన ప్రజలకు అన్ని రకాల సదుపాయలు కల్పించేలా అధికారుల్ని సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు పిలుపు నిచ్చారు. గతంలో విశాఖ కేంద్రంగా ప్రధాని లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టారన్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రులు గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజల రాజధాని మన రాజధాని అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నారని చెప్పారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. మహిళలు ముందుకు వచ్చి రాజధాని కోసం పోరాటం చేశారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.గత సీఎం వైఎస్ జగన్.. వారిపై పోలీసులతో దారుణంగా దాడులు చేయించారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి రావడం శుభపరిణామని చెప్పారు. రాజధాని లేని రాష్ట్రంగా మన రాష్ట్రం ఉందని తెలిపారు. జగన్ మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి పునర్ నిర్మాణం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి అనిత పిలుపు నిచ్చారు.

# సంపాదకీయం

## మేధో సంపత్తితోనే ఆర్థిక ప్రగతి

మేధో సంపత్తి హక్కులు (ఐపిఆర్) అనేది ఆవిష్కరణలు, సాహిత్యం, కళాత్మక రచనలు, వాణిజ్యంలో ఉపయోగించే చిహ్నాలు వంటి సృష్టిని రక్షించే చట్టపరమైన హక్కులు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆవిష్కరణ– ఆధారిత వృద్ధివైపు మారుతున్నందున మేధో సంపత్తి హక్కులు గత కొన్ని దశాబ్దాలుగా గణనీయమైన దృష్టిని ఆకర్షించాయి. ఈ హక్కులు ఆవిష్కర్తలు తమ పనిని ఎలా ఉపయోగించాలో నియంత్రించడానికి ప్రయోజనం పొందడానికి సహాయం చేస్తాయి. ఈ హక్కులు ప్రధాన రకాల్లో పేటెంట్లు, కాపీరైట్లు, ట్రేడ్‌మార్క్‌లు, వాణిజ్య రహస్యాలు, పారిశ్రామిక డిజైన్లు, భౌగోళిక సూచనలు ఉన్నాయి. ఈ హక్కులు సృష్టికర్తలకు ఒక నిర్దిష్ట కాలానికి వారి సృష్టిపై ప్రత్యేక నియంత్రణను ఇస్తాయి. ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని ఏటా ఏప్రిల్ 26న 'పేటెంట్లు, కాపీరైట్, ట్రేడ్‌మార్క్‌లు, డిజైన్లు రోజువారీ జీవితంపై ఎలా ప్రభావం చూపుతాయో అవగాహన పెంచడానికి జరుపుకుంటారు. 2000లో ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్ల్యుఐపిఒ) ఏప్రిల్ 26ని ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవంగా ఎంపిక చేసింది. ఈ 2025 సంవత్సరం వేడుక మేధో సంపత్తి, సంగీతంపై దృష్టిపెడుతుంది. సంగీత పరిశ్రమలో హక్కులు, ఆవిష్కరణ విధానాలు సృష్టికర్తలు, వ్యవస్థాపకులు సంగీత పరిశ్రమకు తాజా ఆలోచనలను తీసుకురావడానికి, పాటల రచయితలు, స్వరకర్తలు, ప్రదర్శకుల పనిని రక్షించడానికి ఎలా శక్తినిస్తాయో అన్వేషించడం లక్ష్యంగా ఉన్నాయి. మేధో సంపత్తి వ్యక్తులు, వ్యాపారాలు సమాజానికి చట్టపరమైన రక్షణ, పోటీప్రయోజనం, ఆదాయ అవకాశాలు, పెట్టుబడులను ఆకర్షించడం, ఆవిష్కరణ, సృజనాత్మకతను ప్రోత్సహించడం, ఆర్థిక వృద్ధి, ప్రపంచ గుర్తింపు, విస్తరణ, వ్యక్తిగత గుర్తింపు మొదలైన అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అంతర్జాతీయ మేధో సంపత్తి సూచికలో, యునైటెడ్ స్టేట్స్ 95.48% స్కోరుతో సూచికలో ముందుంది, తరువాత యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్ ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు వాటి ఆర్థిక, విద్య, సాంకేతిక ప్రయోజనాలతో ముడిపడి ఉన్న కొన్ని ముఖ్యకారణాల వల్ల ఎక్కువ మేధో సంపత్తి హక్కులను పొందడంలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వారి సంపత్తి హక్కుల (ఐపి) ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ప్రపంచ మేధో సంపత్తి హక్కుల సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ వాణిజ్య మేధోసంపత్తి హక్కులు (టిఆర్ఐపిఎస్) ఒప్పందం ద్వారా ప్రపంచ మేధో సంపత్తి నియమాలపై విధాన ప్రభావంతోపాటు బలమైన పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) పెట్టుబడి, అధునాతన విద్య, ఆవిష్కరణ వ్యవస్థలు, బలమైన చట్టపరమైన %డ% మేధోసంపత్తి మౌలిక సదుపాయాలు, జ్ఞాన–ఆధారిత ఆర్థిక వ్యవస్థ, వనరులు ప్రపంచ వ్యాపార వ్యూహం ఉన్నాయి. భారతదేశం పనితీరును చూసినప్పుడు, భారతదేశం 38.64% స్కోరుతో 42వ స్థానంలో స్థిరంగా ఉంది. ఇది స్థిరమైన మేధో సంపత్తి చట్రాన్ని సూచిస్తుంది. 64,480 దరఖాస్తులతో భారతదేశం పేటెంట్ దాఖలులో ప్రపంచవ్యాప్తంగా 6వ స్థానంలో ఉంది. ట్రేడ్‌మార్క్ దాఖలులో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా 4వ స్థానంలో ఉంది. గత సంవత్సరంతో పోలిస్తే 6.1% పెరుగుదల. ఇది భారతదేశం బ్రాండ్‌పై పెరుగుతున్న ప్రాధాన్యతను సూచిస్తోంది. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో, భారత పేటెంట్ కార్యాలయం 1 లక్షకు పైగా పేటెంట్లను మంజూరు చేసింది. ఇది మునుపటి సంవత్సరం కంటే గణనీయమైన పెరుగుదల. ఇప్పటికీ భారతదేశంలో మేధో సంపత్తి హక్కులు చారిత్రాత్మకంగా ఆర్థిక, చట్టపరమైన, విద్య, సాంస్కృతిక కారణాల వల్ల అభివృద్ధి చెందిన దేశాల కంటే వెనుకబడి ఉన్నాయి. భారతదేశం తన స్థూల దేశీయోత్పత్తిలో సాపేక్షంగా తక్కువ శాతాన్ని పరిశోధన, అభివృద్ధిలో 0.7% పెట్టుబడిపెడుతుంది. ఇది అభివృద్ధి చెందిన దేశాలలో దాదాపు 2–3%. భారతదేశంలో అగ్రశ్రేణి సంస్థలు (ఐఐటిలు, ఐఐఎస్‌సి వంటివి) ఉన్నప్పటికీ, ఆవిష్కరణ మేధోసంపత్తి హక్కుల అవగాహన కోసం మొత్తం పర్యావరణ వ్యవస్థ అసమానంగా ఉంది. భారతదేశంలో మేధో సంపత్తి హక్కుల దాఖలు అమలు ప్రక్రియ సంక్లిష్టంగా, తక్కువ వనరులతో కూడుకున్నది. పేటెంట్ ఆమోదాల కోసం ఎక్కువసేపు వేచిఉండటం బలహీనమైన అమలు మేధో సంపత్తి హక్కుల దాఖలు చేయడానికి ప్రేరణను తగ్గిస్తుంది. మేధో సంపత్తి హక్కుల నమోదు ముఖ్యంగా పేటెంట్లు అంతర్జాతీయ దాఖలు ఖరీదైనది. విద్యార్థులు, నిపుణులలో కూడా మేధో సంపత్తి హక్కుల విలువ గురించి అవగాహన లేకపోవడం ఒక లోపమే. భారతదేశ ఆర్థిక వ్యవస్థ హైటెక్ ఉత్పత్తి ఆవిష్కరణల కంటే సేవల ద్వారా (ఐటి, అవుట్‌సోర్సింగ్ కన్సల్టింగ్ వంటివి) ఎక్కువగా నడపబడుతోంది. భారతదేశం దాని మేధో సంపత్తి విధానాలపై అంతర్జాతీయంగా, ముఖ్యంగా అమెరికా వంటి దేశాల నుండి విమర్శలను ఎదుర్కొంది. దేశంలో మేధోసంపత్తి పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి, భారత ప్రభుత్వం 2016లో అన్ని మేధో సంపత్తి హక్కులను ఒకే దార్శనిక పత్రంలోకి చేర్చి, మేధోసంపత్తి హక్కుల చట్టాల అమలు, పర్యవేక్షణ సమీక్ష కోసం ఒక సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. స్టార్టప్‌లు తమ పేటెంట్, డిజైన్ లేదా ట్రేడ్‌మార్క్ అప్లికేషన్లను దాఖలు చేయడానికి, ప్రాసెస్ చేయడానికి 2016లో స్టార్టప్ మేధో సంపత్తి రక్షణ పథకం (ఎస్ఐపిపి) వంటి కొన్ని కీలక చర్యలు ప్రారంభించబడ్డాయి. నేషనల్ లా యూనివర్సిటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు సహా 38 విశ్వవిద్యాలయాలలో మేధో సంపత్తి హక్కుల అధ్యయనం, విద్య, పరిశోధన, అవగాహనను ప్రోత్సహించడానికి డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) ఉన్నత విద్యా సంస్థలలో ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్లను నియమించింది. మేధోసంపత్తి హక్కుల రిజిస్ట్రేషన్/గ్రాంట్ ప్రక్రియలపై వినియోగదారులకు తక్షణ మద్దతు మార్గదర్శకత్వం అందించడానికి మేధోసంపత్తి హక్కుల సారథి చాట్‌బోట్ రూపొందించబడింది. భారతదేశంలో ప్రభావవంతమైన మేధో సంపత్తి హక్కుల అమలును గుర్తించడానికి ప్రోత్సహించడానికి 13 విభాగాలలో జాతీయ మేధో సంపత్తి అవార్డులను ఏటా ప్రదానం చేస్తారు. పేటెంట్ సమూహార్జనను సులభతరం చేయడానికి పేటెంట్స్ (సవరణ) నియమాలు, 2024 ను నోటిఫై చేశారు. మేధో సంపత్తి హక్కుల పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి, స్టార్టప్‌లు తమ ఐపీని రక్షించుకోవడానికి ప్రోత్సహించడానికి ఫీజు రాయితీలు ఇవ్వబడ్డాయి. స్టార్టప్‌లు, చిన్న సంస్థలకు పేటెంట్లలో 80% వరకు, ట్రేడ్‌మార్క్‌లలో 50%, డిజైన్లలో 75% వరకు ఫీజు రాయితీ ఇవ్వబడుతోంది. మేధో సంపత్తి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది కాబట్టి, దీర్ఘకాలిక వ్యూహంతో మరిన్ని మేధో సంపత్తి హక్కులని సాధించాలి.

# సాగునీటి వివక్షతపై ఎలుగెత్తి చాటిన విద్యాసాగర్ రావు

వలస పాలకుల స్వార్థ పాలనలో, సాగు నీటి రంగంలో జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టుల్లో మోసంపై గణాంకాలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి విద్యాసాగర్ రావు. తెలంగాణకు నీటి విషయంలో జరిగిన మోసం, ప్రాజెక్టులపై జరిగిన అన్యాయం పై విద్యాసాగర్‌రావు చేసిన పోరాటం, అధ్యయనం అనన్య సామాన్యం. సాగునీటి రంగంలో నిపుణులైన విద్యాసాగర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు నీటి కేటాయింపుల విషయంపై జరిగిన అన్యాయం పై ఎలుగెత్తి చాటారు. నీటి పారుదల శాఖలో వివిధ పదవులలో, హోదా లలో పని చేసిన ఆయన, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రాజెక్టులు, నీటి కేటాయింపు లపై ఎప్పటికప్పుడు సమాచారం, సలహాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేసేవారు. సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన ఆధార సహితంగా, బహిర్గత పరిచి, ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ను ప్రేరేపించడంలో, ఉద్యమ శిఖరం పార్టీ అధినేతకు వెన్ను దన్నుగా ఉన్నారు. అలా కేసీఆర్‌కు ఉన్న అతి దగ్గర వ్యక్తులలో విద్యాసాగర్ రావు అంతరంగిక ముఖ్యులలో ఒకరై పోయారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అనంతరం తన పరి జ్ఞానంతో కొత్త ప్రాజెక్టుల రూప కల్పనలో ఆయన భాగస్వామ్యం విదిదీయ జాలనిది, ఆయన పాత్ర నిజంగా మరువలేనిది.. "జయశంకర్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప తెలంగాణ మహను భావుడు విద్యాసాగర్ రావు" అని కేసీఆర్ చేత ప్రశంసింప బడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ ఆయన. ఆర్. విద్యాసాగర్‌రావు (14 నవంబరు 1939–2017 ఏప్రిల్ 29) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన జాజిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యా వంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్థితి, వారి కుటుంబంలో అందరికీ చదువు పట్ల ఆసక్తి కలగడానికి హేతువైంది. వారి గ్రామంలో తొలిసారిగా మెట్రిక్యులేషన్ చేసిన వ్యక్తి రాఘవరావు కాగా, మొదటి పట్టభద్రులు రాఘవరావు పెద్ద కుమారుడు, మొట్ట మొదటి ఇంజనీరింగ్



పట్టభద్రుడు విద్యాసాగర్‌రావు కావడం విశేషం. విద్యాసాగర్ రావు 1960లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి ఇంజనీరింగ్ లో పట్టభద్రుడు లయ్యారు. 1979 లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి రూర్కీ) లో నీటి వనరుల అభివృద్ధిలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన 1983లో అమెరికా లోని కొలరాడో స్టేట్ విశ్వ విద్యాలయం నుండి నీటి వనరుల వ్యవస్థ ఇంజనీరింగ్ లో డిప్లొమా పొందారు. ఆయన 1990లో ఢిల్లీ విశ్వ విద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టాను కూడా సంపాదించారు. బీటెక్ పూర్తి అయిన వెంటనే క్యాంపస్‌లోని మహిళా కాలేజీ మెయింటెనెన్స్ ఇంజినీరుగా ఉద్యోగంలో చేరారు. కళల పట్ల ఆసక్తి కలిగిన ఆయన, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా రాయటం, నాటకాలు వేయడం వంటి హాబీ లకు దూరం కాలేదు. అను దినం సాయంత్రం విధుల నిర్వహణ అనంతరం రవీంద్ర భారతికి వెళ్ళేవారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి, అనంతరం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, నీటిపారుదల శాఖలో ఇంజ నీరుగా పనిచేశారు. ఢిల్లీలో ఉన్న సమయంలో సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసు కున్నారు. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాక, తరువాత తిరిగి హైదరాబాద్ వచ్చారు. దాదాపు 34 సంవత్స రాల పాటు కేంద్ర జల సంఘం లోనే విధులు నిర్వహించడం తో ఆయన దేశ వ్యాప్తంగా జల వనరుల అంశంపై అపారమైన అనుభవం గడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల విషయాలపై సమగ్ర అవగా హన, సరైన ఆలోచనను కలిగి ఉండేవారు. 2016 నవంబ రులో కాకతీయ విశ్వ విద్యాలయంచే నిర్వహించ బడిన "మిషన్ కాకతీయ" ప్రాజెక్టుకు సంబంధించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలో వ్యవసాయ రంగంలో నీటి పారుదల ప్రాజెక్టు లపై ప్రభుత్వ విధానాలను సమగ్రంగా వివరించారు. 2014లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (భారత దేశం) ఆయనను "లీడింగ్ ఇంజ నీరింగ్ పెర్సనాలిటీస్ ఆఫ్ ఇండియా"గా గుర్తించి, పురస్కార గ్రహీతను చేసింది. ఆయన ఎన్నో రచనలు చేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాల స్నింటిని కలిపి.. 'నీళ్లు–నిజాలు' పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. అలా "నీళ్ళు నిజాలు విద్యాసాగర్ రావు"గా పేరెన్నిక గన్నారు. ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రంలో ఉచిత పాత్రలో నటించారు. ఐక్యరాజ్య సమితి ఇన్విరాన్ మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యు డిగా, సెంట్రల్ వాటర్ కమి షన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా సేవలు అందించిన విద్యాసాగర్ రావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన లోనూ సలహాలు అందించారు. సాగునీటి రంగ రిటైర్డ్ చీఫ్ ఇంజినీరుగా, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగా సుపరిచితులు అయిన విద్యా సాగర్‌రావు రచయితగా, నటునిగా చాలా ప్రతిభ గురించి చాలా మందికి తెలియదు. గరీషం కలం పేరుతో ఆయన రాసిన రచనలు అనేక పత్రికల్లో ప్రచురించారు. బాల్యంలో కవి సమ్మేళనాలు, నాటకాల ప్రదర్శనలకు వెళ్లేవారు. కాలేజ్ స్థాయి వివిధ పోటీల్లో పాల్గొని, నాటకాలు కూడా వేసేవారు. కొంతకాలం ఆనారోగ్యానికి గురై, 2017 ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో దివంగ తులైనారు.

# సజీవ సాక్ష్యాలు.. మైదం చంద్రశేఖర్ చిత్రాలు

"చంద్ర" పేరుతో దేశ విదేశాలలో పేరెన్నిక గన్న అపురూప చిత్రకారుడు, శిల్పి, కార్టూనిస్టు మైదం చంద్రశేఖర్. కళ్లకు కనిపించిన, కళ్ల ముందు కదలాడిన ఊహలకు జీవం పోసి, గీసే గీతలతో అద్భుత సృష్టి చేయడానికి అనర్హమైనది ఏదీ లేదని నిరూపించిన ప్రతిభాశాలి చంద్ర. చంద్ర 1946, ఆగష్టు 25వ తేదీన వరంగల్ జిల్లా, నర్సింహులపేట మండలం, పెద్దముప్పారం గ్రామంలో సోమలక్ష్మి, రంగయ్య దంపతులకు జన్మించారు. 1955లో హైదరాబాద్ లోని సుల్తాన్ బజార్ పాఠశాలలో మెట్రిక్ వరకు చదివారు. సైఫాబాద్ సైన్స్ కళాశాలలో పి.యు.సి (ప్రీ యూనివర్సిటీ కోర్స్) పూర్తి చేశారు. తర్వాత ఫైన్ ఆర్ట్స్‌లో పట్టభద్రులు అయినారు. డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాల యంలో ఆర్టిస్ట్ కమ్ డిజైనర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. బాపు తర్వాత ఆ స్థాయిలో వివిధగా వార, మాస పత్రికలకు బొమ్మలు గీసిన ఖ్యాతి చంద్రకే దక్కుతుంది. ఒకనాడు ఏ ఇంట చూసినా సాహిత్య గ్రంథాలు, నవలలు, కథల పుస్తకాలు దర్శనం ఇవ్వగా, అనంతర కాల గమనంలో పత్రికలు ప్రజలకు చేరువై, చదువరుల నిత్య జీవితాలలో మమేకం కావడంతో వాటిలో తాను బొమ్మలు వేయడంలో సాధనచేసి, భావాత్మకమైన రేఖాచిత్ర కళలో తన దైన ప్రత్యేక ముద్రవేశారు. చంద్ర తొలిరోజుల్లో బాపు అడుగుజాడల్లో నడిచిన చంద్ర ఆ తర్వాత తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన కొన్ని వేల కథలకు చిత్రాలను సమకూర్చారు. ఎన్నో పుస్తకాలకు ముఖచిత్రాల రూప కల్పన



చేశారు. వేలకొద్దీ కార్టూన్లను గీశారు. చిత్రకళ మీద వ్యాసాలు, సమీక్షలు, కవితలు... అలాగే చంద్ర దాదాపు 150 కి పైగా కథలు రాసి, వివిధ పత్రికలలో ప్రచురించారు. ఆయన మొదటి కార్టూన్ 1959లో ఆంధ్రపత్రికలో, మొదటి కథ 1961లో ఆంధ్రప్రభలో అచ్చయ్యాయి. ఇతడు జ్యోతి, యువ మాసపత్రికలలో ఆర్టిస్టుగా పనిచేశారు. స్వాతి మాసపత్రిక, మయూరి వారపత్రిక, పుస్తక ప్రపంచం మాసప త్రికలలో సంపాదక వర్గంలో పనిచేశారు. 1970 నుండి 1976 వరకు విప్లవ రచయితల సంఘంలో సభ్యుడుగా ఉన్నారు. విరసం కళాకారుడిగా ఎమర్జెన్సీ సమయంలో జైలుశిక్షను అనుభవించారు. ఇరవై సినిమాలకు, ఆరు డాక్యుమెంటరీ చిత్రాలకు కళాదర్శకుడిగా పనిచేశారు. రెండు డాక్యుమెంటరీ చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఇంద్రధనుస్సు, వెన్నెలవేట మొదలైన టి.వి.సీరియల్స్‌కు దర్శకత్వం వహించారు. చంద్ర వేసిన బొమ్మలు పాత్రలనే కాక ఆ పాత్రల లోతుల్లోని మానసిక ఆనందాల్ని, అంతరంగాల అల్లకల్లోలాల్ని, సంఘర్షణల్నీ చెబుతాయి. కను చూపుల ద్వారా గ్రహించిన దృశ్యాలను, మానస రూపాలను, చేతి మునివేళ్లతో అలవోకగా కుంచెతో జాలు వారించి, సజీవాలుగా, అగజీత రేఖాచిత్రాలు, వర్ణచిత్రాలను చిత్రీకరించి, అజరామరాలుగా చంద్ర తీర్చి దిద్దారు. కళా ప్రేమికుల మనో ఫలకాలపై చెరిగిపోని జ్ఞాపకాలుగా మిగిల్చారు. నాలుగు దశాబ్దాల పాటు నలుపు తెలుపులో ఇలస్ట్రేషన్స్, రంగుల్లో బొమ్మలు, కార్టూన్లు, పెయింటింగ్స్, గ్రీటింగ్ కార్డులు, లోగోలు గీసిన చంద్రకు దేశ విదేశాలలో ఉన్న అభిమానులకు లెక్కే లేదు. వేల సంఖ్యలో నవలలకు కవర్ పేజీలు వేశారు. దశాబ్దాల పాటు వార పత్రికలకు పండగ ప్రత్యేక సంచికల్లో కవర్ పేజీలు గీశారు. ఓపెన్ యూనివర్సిటీలో ఆయన పాఠాలు కూడా చెప్పారు. ప్రముఖ డైరెక్టర్ బి. నరసింగ రావుతో ఉన్న అనుబంధంతో ఆయన చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్ గా పనిచేయడమే కాకుండా కొన్ని సినిమాలలో నటించారు. మరికొన్ని చిత్రాలలో అతిథి పాత్రలు సైతం పోషించిన చంద్ర, టీవీ సీరియల్స్ ను డైరెక్ట్ చేశారు. గత కొంతకాలంగా చంద్ర నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ, తాజాగా కరోనా బారిన కూడా పడ్డారు. మదర్ థెరిసా రీహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతూ గత సంవత్సరం ఏప్రిల్ 29న రాత్రి మృతి చెందారు.

# దేవతలకు రూపాలిచ్చిన కళాతపస్వి రవివర్మ

"రవివర్మకే అందని ఒకే ఒక అందానివో", "రవి చూడని పాడని నవ్య నాదానివో" అంటూ "రావణుడే రాముడైతే" చిత్రం (1980) కోసం, వేటూరి సుందర రామమూర్తి కలం నుండి జాలువారి, బాలు – జానకి గళాల నుండి అలవోకగా, సుమధురంగా గానం చేయబడిన పాట, సంగీత ప్రియులకు సుపరిచితమే. చిత్రకళకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన చిత్రకారుడు రాజా రవివర్మ. హైందవ సంస్కృతిలో అంతర్భాగమైన రామాయణ, మహాభారత ఆది పురాణాలలో ఘట్టాలను, చిత్రాలుగా మలిచి, గుర్తింపు పొందారు రాజా రవివర్మ. భారతావనిలోని కేరళలో తిరువనంత పురానికి 25 మైళ్ల దూరంలోని కిలిమానూరు, రాజ ప్రాసాదంలో ఉమాంబ తాంబురాట్టి, నీలకంఠం భట్ట దంపతులకు 1848 ఏప్రిల్ 29న రవివర్మ జన్మించారు. చిన్నతనంలోనే ఈయన చూపిన ప్రతిభ వల్ల, ట్రావెన్కోర్ మహారాజా ఆయిల్యం తిరునాళ్ చేరదీసి, ప్రోత్సహించారు. అక్కడే ఆస్థాన చిత్రకారుడైన, శ్రీ రామ స్వామి నాయుడు వద్ద శిష్యరికం చేశాడు. చిత్రకళను బ్రిటిష్ దేశస్థుడైన, థియోడార్ జెన్సన్ వద్ద నేర్చుకున్నారు. పాశ్చాత్య చిత్రకళలోని శక్తి, కొట్టొచ్చినట్లున్న భావ వ్యక్తీకరణ, రవి వర్మను ఎంతగానో ప్రభావితం చేశాయి. అవి భారతీయ చిత్రకళా శైలికి ఎంతో భిన్నంగా కనిపించాయి. 1873 వియన్నా చిత్ర ప్రదర్శనలో, మొదటి బహుమతి పొందిన తర్వాత రవి వర్మ వెలుగులోకి వచ్చారు. ఆయన తన చిత్రాలను, దక్షిణభారత స్త్రీల లాగా ఊహించి, అందంగా చిత్రించే వాడు. ముఖ్యంగా మహాభారతం లోని నల దమయంతులు, శకుంతల దుష్యంతుల కథలలోని ఘట్టాలను, చిత్రాలుగా చిత్రించి ఎంతో పేరు సంపాదించారు. భారతీయుల ఊహలలో, తమ పురాణాలలో ఉన్న పాత్రలు రవివర్మ రూప కల్పన చేసిన చిత్రాల్లాగా మారిపోయాయి అంటే అతిశయోక్తి లేదు. రవివర్మ తరుచుగా తన శైలిలో ప్రదర్శ నాత్మకంగాను, చాందసంగాను ఉంటాయని విమర్శలను ఎదుర్కొన్నా, ఆయన పనితనం భారతదేశంలో ప్రశంసా పాత్రమై, కీర్తి గడించింది. 1894లో లితో గ్రాఫిక్ యంత్రాలు, చిత్రించడానికి అనువైన రాళ్లు, సాంకేతిక నిపుణులను, జర్మనీ నుండి ఆయన తెప్పించారు. దేశంలోనే మొదటిసారిగా అత్యాధునిక ప్రెస్ ను ముంబైలో ప్రారంభించారు. అయితే అక్కడ స్థలాభావం కారణంగా, భయంకరమైన ప్లేగు వ్యాపించడం వల్ల, కార్మికులు సరిగా లభించక పోవడం వల్ల 4 సంవత్సరాల తర్వాత, మహారాష్ట్ర లోని కొండా కొనల నడుమ ఉన్న, మలవాలి అనే గ్రామాన్ని పెంచుకున్నారు. పక్కనే తన నివాసాన్ని కూడా ఏర్పరచుకున్నారు. రవి వర్మ మరణించడానికి రెండేళ్ళ ముందు, తాను నెలకొల్పిన ప్రెస్ ను, తన స్నేహితుడైన ఒక జర్మన్ సాంకేతిక నిపుణునికి విక్రయించారు. దాంతోపాటు 100 చిత్రాలకు కాపీరైట్ కూడా ఇచ్చివేసారు. అయితే 1972లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం కారణంగా, ప్రెస్ కు భారీ నష్టం వాటిల్లింది. ఆ తర్వాత మిగిలిన చిత్రాలను రాళ్లను, ప్రెస్ చుట్టూ నివసించే వారికి పంచి పెట్టారు. ఆ తర్వాత ముంబై–పూణే ప్రభుత్వాలు కొన్నిటిని మాత్రమే భద్ర పరచ గలిగాయి. శ్రీకృష్ణ రాయబారము, రావణ జటాయు వధ, ఇంద్రజిత్ విజయము, శకుంతల, సుభ ద్రార్జునులు, దమయంతికి హంస సంవాదము, శంతనుడు మత్స్యగంధి, ప్రేమలేఖ వ్రాస్తున్న శకుంతల, కణ్వుని ఆశ్రమములో ఋషి కన్యగా శకుంతల, ఇంద్రజిత్ విజయము, లేడీ విత్ ఫ్రూట్స్, హార్ట్ బ్రోకెన్, పల్లెపడుచు, భిక్షకుల కుటుంబము గుడి వద్ద దానాలు స్త్రీ లాంటి అపురూప చిత్రాలు రాజా రవివర్మ కు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి.


# గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలి



**కాకినాడ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 28 ప్రజా జోతి** గర్భిణీలు క్రమం తప్పకుండా నిత్యం పోషకాహారం తీసుకోవాలని ప్రముఖ స్త్రీ, ప్రసవ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్ కే సాబెరా పేర్కొన్నారు. బోట్ క్లబ్ ఉద్యానవనం లో న్యూరో స్టార్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. గర్భిణీలకు కొన్ని విటమిన్లు, మినరల్స్ అధికంగా అవసరమవుతాయని అందుకు గాను తాజా పండ్లు ,ఆకుకూరలు, పాల ఉత్పత్తులను తీసుకోవాలని అన్నారు .ప్రతి మహిళ జీవితంలో మెనూపాజ్ దశ వస్తుందని ఈ సమయంలో హార్మోన్ల ప్రభావంతో బరువు పెరగడం సహజమన్నారు. ప్రతి మహిళకు 45 మధ్యస్థ వయసులో మెనోపాజ్ వచ్చి పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని అన్నారు. ఈ దశలో పొట్ట, నడుం భాగాలలో కొవ్వు అధికంగా చేరి బరువు పెరుగుతారని అన్నారు. జన్యుపరమైన కారణాల వలన కూడా ఈ వయసులో కొందరికి మోకాళ్ళ నొప్పులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు గాను వయసు తారతమ్యత లేకుండా వాకింగ్ చేయాలని అన్నారు. సమతుల్యహారాన్ని పరిమితంగా తీసుకోవాలని సాబెరా తెలిపారు. వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ , కార్యదర్శి దాసరి శ్రీధర్, యనమల రామం, రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ మోడల్ ఈఏప్ సెట్, నీట్‌కు విశేష ఆదరణ





**ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26,27,28 తేదీలలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన , నీట్ కు వేలాది మంది విద్యార్థులు ఆదరణ లభించింది అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు అక్బర్, రవి లు తెలిపారు. ఎంపీసీ / బైపీసీ స్ట్రీమ్ లలో పేపర్ చాలా బాగుంది అని, పబ్లిక్ ఈఏప్ సెట్, లో మంచి ర్యాంక్స్ తెచ్చుకోడానికి చాలా ఉపయోగ పడుతుంది అని విద్యార్థులు తెలిపారు అని వారు అన్నారు. తిరుపతి లోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల లో 4 రోజులపాటు ఈఏప్ సెట్, నిర్వహించుకోడానికి అవకాశం ఇచ్చిన యాజమాన్యం కు, ప్రిన్సిపాల్, కుమార్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలు కోసం పోరాడటంతో పాటు విద్యార్థుల మెరుగైన విద్యా లో రానించడనికి ఎల్లప్పుడూ తోడ్పాటుంది అని వారు అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ ఐ నాయకులు శివ, బాబ్జి, జిల్లా ఉపాధ్యక్షులు తేజ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో యాకసిరి, బురదగాలి కొత్తపాళెం గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

### మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు





**ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం చిట్టమూరు పిహెచ్ సిలోని యాకసిరి, మల్లాం పిహెచ్ సిలోని బురదగాలి కొత్తపాళెం గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. మల్లాం పిహెచ్ సిలో ఏప్రిల్ 29న కోగిలి, మల్లాం-2లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో చిట్టమూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, మల్లాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.మదన్ మోహన్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, డాక్టర్ పద్మావతి, ఎంపిటిసి ధనుంజయ, సర్పంచులు సుబ్బమ్మ, వై.మణి, పంచాయతీ కార్యదర్శులు రమేష్, ఎం.జనార్ధన్, స్థానిక నాయకులు చిన్నారావు, జి.సుబ్రహ్మణ్యం, కృష్ణారెడ్డి, సూపర్వైజర్ చెంచుకృష్ణ, ఏఎన్ఎంలు ఎన్.మేరి హేమలత, డి.రాణి, కె.లత, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన యూత్ క్లబ్ నాటక పరిషత్ నాటిక పోటీలు

### ప్రథమ బహుమతి పొందిన "స్వేచ్ఛ" జనరల్ భోగి లకు ద్వితీయ బహుమతి అనూహ్యముకు తృతీయ బహుమతి



**పాలకొల్లు. ప్రజాజ్యోతి (కొట్టి రామం) ఏప్రియల్ 28.** పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కొంతేరులో యూత్ క్లబ్ నాటక పరిషత్ మూడు రోజులపాటు నిర్వహించిన 43వ అఖిలభారత నాటిక పోటీలు ముగిసాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభకు యూత్ క్లబ్ అధ్యక్షులు అంబటి మురళి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గాయకులు చేగొండి సత్యనారాయణ మూర్తి యూత్ క్లబ్ నాటక పరిషత్ సభ్యులు విజేతలను సత్కరించి ప్రశంసా పత్రాలను నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కవితలు అసోసియేషన్ హైదరాబాద్ వారు ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటికకు ద్వితీయ ఉత్తమ ప్రదర్శన నటీనట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారి అనూహ్యం నాటికకు తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతులు పొందాయి జ్యూరీ ప్రదర్శనగా కృష్ణ గుడివాడ వారి చంద్రయ్య నాయుడు నాటిక ఎంపికయ్యింది. ఉత్తమ దర్శకునిగా బియమ్ రెడ్డి ఉత్తమ రచన జనరల్ బోగీలు నాటిక రచయిత పిటి మాధవ వితీయ ఉత్తమ రచన పరమాత్ముని శివరాం ఉత్తమ నటుడిగా నాటికలు ఆనంద్ పాత్రి గారి గోవాడ వెంకట్ ఉత్తమ నటి జనరల్ బోగీలు నాటికలు సావిత్రమ్మ పాత్రధారి సురభి ప్రభావతికి ఉత్త ఉత్తమ ప్రతి నాయకుడిగా జనరల్ బోగీలో నాటికలు సిఐ పాత్ర గారి గోపరాజు విజయ్ నటుడిగా అనూష నాటికలు గారి గుడాల హరిబాబుకు ఉత్తమ బాలనటిగా నా శత్రువు నాటికలు చేత పాత్ర గారి ఉత్తమ సంగీతం జనరల్ బోగీలు లీల మోహన్ కు ఉత్తమ రంగాలంకరణ ద్వారబంధాల చంద్రయ్య నాయుడు నాటికకు పీవీ సత్యనారాయణ భీమ్ కుమార్ లకు ఉత్తమ ఆహారం ద్వారా బంధాల చంద్ర నాయుడు నాటికకు పీవీ సత్యనారాయణ ఉత్తమ క్యారెక్టర్ నటుడు అనూష నాటికకు ఆనందరామయ్య పాత్రధారి రాజా కి రాజేష్ కి ఉత్తమ ద్వితీయ నటి దేవరాగం నాటికలు కూతురు పాత్రధారిని ఏస్తే జ్యోతిరానికి ఉత్తమ సహాయ నటుడిగా జనరల్ బోగీలు నాటికలో హెడ్ కానిస్టేబుల్ పాత్రధారి కే నాగేశ్వరరావు కు ఉత్తమ సహాయనటిగా స్వేచ్ఛ నాటికలో మహి పాత్రదారిణి సురభి లలితకు లభించాయి జ్యూరీ నటులుగా స్వేచ్ఛ నాటికలో శ్వేత పాత్ర దారిణి మంజు భార్గవి కి అంగికం భవనంమిశ్ర నాటికలో బ్రహ్మాజీ పాత్రధారి పోగర్తి నాగేశ్వరరావుకు ద్వారబందాలచంద్రయ్య నాయుడు నాటికలో లక్ష్మణ స్వామి పాత్రదారి శౌంఠి శ్రీనివాస్ కు బహుమతులు లభించాయి. ఈ నాటిక పోటీలకు ఈ నాటిక పోటీలకు గుణ నిర్ణేతలుగా కొంతేటి సర్వేశ్వర లింగం కొడమంచిలి సత్యప్రసాద్ గంటా రామ్మోహన్ లు వ్యవహరించారు. యూత్ క్లబ్ సభ్యులు పులపర్తి రాజగోపాల్ బోణం రవిబాబు జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం గంటా ముత్యాలరావు గంట వెంకటేశ్వరరావు అంబటి నవీన్ చంద్ అడ్డాల సత్యనారాయణ గోడి మోహన్ రావు జవ్వాది శ్రీనివాసులనాయుడు యూత్ క్లబ్ ఆర్గనైజర్స్,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తిరుపతి రైల్వే స్టేషన్లో ప్రయాణికుల భద్రత అవగాహన సదస్సు



**ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** హిందూ పర్యాటక కేంద్రాలలో అత్యంత ప్రాధాన్యమైన స్థలం తిరుపతి. ప్రతి రోజు లక్షలాది మంది భక్తులు రైలు మార్గం సహా వివిధ రవాణా మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకుంటున్నారు. వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని, రైల్వే భద్రత దళం (ఆర్పీఎఫ్) , రైల్వే పోలీస్ విభాగం సంయుక్తంగా తిరుపతి రైల్వే స్టేషన్లో భద్రత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వేలో పని చేసే అన్ని విభాగాల సిబ్బంది, ముఖ్యంగా ప్లాట్‌ఫామ్‌లపై నిరంతరం పనిచేస్తూ ప్రయాణికులతో నిత్యం సమీపంగా ఉండే టెక్నికల్ సిబ్బంది, క్లీనింగ్ సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు.సదస్సులో మాట్లాడిన శ్రీమతి ఎస్.ఆర్. హర్షిత, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్, రైల్వే పరిసరాలలో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, లేదా అసాంఘిక చర్యలు చోటుచేసుకున్నా, వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల రక్షణ కోసం 24 గంటలు అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో పునర్నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అన్ని తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, రేణిగుంటలో ఆర్పీఎఫ్ ఇన్స్పెక్టర్‌గా సేవలందించిన సందీప్ తిరుపతి స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ, తిరుపతిలోనూ తన అంకితభావ సేవలతో ప్రయాణికుల భద్రతను5 మరింతగా బలోపేతం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం.ఆశీర్వాదం, సబ్ ఇన్స్పెక్టర్లు ధర్మేంద్ర రాజు, రామకృష్ణారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజలు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి.




**పాతపట్నం ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి న్యూస్.** పాతపట్నం మేజర్ పంచాయతీలో హౌసింగ్ బోర్డు కాలనీ నందు ప్రజలు నివాస ప్రాంతంలో ఇళ్ల మధ్య మద్యం దుకాణం (వైన్ షాపు) కేటాయించడం పై వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నాయకులు, స్థానికులతో కలసి అక్కడ నిరసన తెలియజేశారు. స్థానిక మహిళలు, నివాసస్థులు ఆమె దృష్టికి అన్యాయంగా ఇళ్ళ మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేశారని బాధ వ్యక్తంచేశారు. రెడ్డి శాంతి నిరసన తెలియజేస్తూ స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కి స్థానికులు తమ బాధ వెల్లబుచ్చుకున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు పిలిపించి జనావాసాల మధ్య మద్యం(వైన్) వ్యాపారం నిర్వహిస్తున్నారని, వెంటనే ఇక్కడ నుంచి తొలగించాలని చెప్పలేకపోతున్నారా? లేక ఎమ్మెల్యే మాట అధికారులు ధిక్కరిస్తున్నారా ? సామాన్య కుటుంబం నుంచి వచ్చానని పలు వేదికలపై చెప్పుకుంటున్న ఆయన ప్రజలకు జరుగుతున్న అన్యాయం పై తక్షణమే స్పందించి మద్యం షాపును అక్కడ నుంచి ఎత్తివేయాలని, లేని పక్షంలో స్థానిక ప్రజలతో ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

## పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ న్యాయవాదుల సంఘం ఆద్వర్యంలో నిరసన ర్యాలీ




**బద్వేల్ ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి న్యూస్)** జమ్మూ కాశ్మీర్ లో ని పహల్గాం లో 22-4-25 వతేదీన పర్యాటకులపై కొంతమంది మతోన్మాద తీవ్రవాదులు దాడులు చేసి వారిని మతం అడిగి మరీ అత్యంత కిరాతకంగా చంపడాన్ని నిరసిస్తూ ఈరోజు బద్వేలు న్యాయవాదుల సంగం ఆధ్వర్యంలో ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతు అమాయకపు పర్యాటకులను మతం అడిగి మరి 26 మందిని నిర్దాక్షిణ్యంగా చంపడం చాలా హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. దీని వెనుక పాకిస్థాన్ దేశం హస్తం ఉందని ఆదారాలు కూడా ఉన్నందున ఆ దేశానికి సరైన బుద్ధి చెప్పాలని. భారత ప్రభుత్వన్ని కోరుతూ భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు మరలా జరగకుండా తీవ్ర వాదంపై కఠిన నిర్ణయాలు తీసుకోవలసిన సమయం ఆసన్నమైందన్నారు. తీవ్ర వాదంపై భారత దేశ ప్రభుత్వం తీసుకొను ఏ చర్యకైనా భారత దేశ ప్రజల సంపూర్ణ మద్దతు ప్రభుత్వానికి ఉంటుంది అని తెలియచేసారు. తీవ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటంబాలకు ప్రగాడ సాను భూతిని తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదుల సంఘం ప్రెసిడెంట్ డి వి ఎస్ ఆర్ కృష్ణ. జనరల్ సెక్రెటరీ మురళి క్రిష్ణ, సీనియర్ న్యాయ వాదులు బ్రహ్మారెడ్డి. రాజేశ్వరరావు. ప్రదీప్ కుమార్ పవార్, ఓబుల్ రెడ్డి, సూర్య నారాయణరెడ్డి, సురేష్ బాబు, శ్రీదర్ నాయుడు, బొల్లు బాస్కర్, దామోదర్, పోలు ప్రవీన్, పోలు రేవంత్, నూతి శ్రీనివాసులు, రమణా రెడ్డి, విజయ్ కుమార్, రాజ్ కుమార్, సుబ్బరాయుడు మరియు ఇతర న్యాయవదులు పాల్గొన్నారు.

# రూ. 2.5 కోట్ల విలువగల 72 ఎర్రచందనం దుంగలు స్వాధీనం





**ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్..**
**ఒక లారీ, మరో కారును స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్...**

**ఏప్రిల్ 28( ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో 72 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక లారీ, ఒక కారు స్వాధీనం చేసుకుని, ఏడుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ ఎస్ ఐ సి. వినోద్ కుమార్ టీమ్ ఆదివారం శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు తనిఖీ చేసి కాటూరు ఫారెస్ట్ బీటు పరిధిలో పంగూరు మెయిన్ రోడ్డు దొమ్మరపాళెం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం ఉదయం ఒక కారు, దాని వెనుక ఒక లారీ కొద్దీ దూరం లో ఆపి, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని చేరుకుని చుట్టుముట్టారు. లారీని పరిశీలించగా అందులో 72 ఎర్రచందనం దుంగలు కమీపించాయి. వాటి విలువ సుమారు రూ. 2.5కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వాహనాల్లో ఉన్న వారిని అరెస్ట్ చేయగా వారిలో నలుగురు తిరుపతి జిల్లాకు చెందిన వారు గాను, మరో ముగ్గురిని తమిళనాడు వాసులుగా గుర్తించారు. వారిని ఎర్రచందనం దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 45 వినతులు





**కమిషనర్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య.**

**ఏప్రిల్ 28,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 45 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 9 మంది తమ సమస్యలు తెలుపగా, 35 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్. సి.మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, ఆరని సంధ్య, అనిల్ కుమార్ విచ్చేసి తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ చేపల మార్కెట్ ఎదురుగా కాలువలు సరి చేయాలని, అన్నారావు కూడలి వద్ద రోహిణి అపార్ట్మెంట్ వద్ద నీటి సమస్య పరిష్కరించాలని, తిరుచానూర్ వెళ్ళే మార్గంలో గరుడ వారధి పనులు సక్రమంగా పూర్తి చేయాలని, మధురానగర్ వద్ద యూ.డి.ఎస్. పనులు పూర్తి చేయాలని, జయస్యాం థియేటర్ సమీపంలో కూలెందుకు సిద్ధంగా ఉన్న భవనాన్ని పరిశీలించాలని, సూరయ్య కట్ట వద్ద ఆక్రమించి నిర్మించిన స్థలం చూడాలని, కొర్లగుంట వద్ద సి.సి.రోడ్డు నిర్మించాలని, గిరిపురం లో గుంతల రోడ్డు సరి చేయాలని అలాగే పలువురు సమస్యలు పరిష్కరించాలని కోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి సి పి మహా పాత్ర, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి.ఈ.లు, ఏసిపి లు, తదితరులు ఉన్నారు.

# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో గెద్దనాపల్లి గ్రామానికి చోటు తెచ్చిన తల్లి, కుమారులు

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్... కిర్లంపూడి,** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం,గెద్దనావల్లి గ్రామానికి చెందిన విక్టరీ లైఫ్ చర్చ్ సంఘ కాపరి రెవరెండు దడాల విక్టర్ బాబు సతీమణి దడాల జాన్సన్ గ్లోరి మరియు పెద్ద కుమారుడు దడాల జోషీ రిచర్డ్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు.డిశంబర్ 1, 2024 లో హల్లెల్ మ్యూజిక్ స్కూల్,విజయవాడ వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టీన్ దండింగి ఆధ్వర్యంలో సంగీత వాయిద్య ప్రదర్శన నిర్వహించారు.ఈ ప్రదర్శనలో 18 దేశాల నుంచి 1100 మంది సంగీత కళాకారులు పాల్గొని ఆన్లైన్లో గంటపాటు సరళీ స్వరాలను కీబోర్డుపై ఆలపించి ఆ వీడియోలను ఇన్స్టాగ్రామ్ లో అప్లోడ్ చేసి ఈ ఘనత సాధించారు.1100 మంది పాల్గొనగా 1046 మంది ఈ రికార్డుకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలో మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో జరిగిన రికార్డు గ్రహీతల సదస్సులో పాస్టర్ దండింగి అగస్టిన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా మన గెద్దనాపల్లి గ్రామానికి వరల్డ్ రికార్డ్ స్థాయిలో ఘనత దక్కినట్లు పాస్టర్ దడాల విక్టర్ బాబు గర్వంగా తెలియజేసారు.





# మే 1 నుండి వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం



**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర** కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో మే ఒకటో తేదీ నుండి మే 31వ తేదీ2025 వరకు వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు గారు తెలిపారు. ఇప్పటికి 18 సంవత్సరాల నుండి ఈ శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని, చిన్నవారి నుండి పెద్దవారి వరకు యువత పెడద్రోవ పడుతుందని, మొబైల్ కు ఎడిట్ అవుతున్నారని దీనిని క్రీడల ద్వారా కొంచెం అయినా అరికట్టవచ్చునే దృఢ సంకల్పంతో ప్రతి సంవత్సరం 150 మంది చిన్నారులను భావి భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తయారు చేస్తున్నామని, క్రీడాకారులకు క్రీడా దుస్తులను, ప్రతిరోజు ఉదయం పౌష్టికాహారం గ్రుడ్డు పాలు, సాయంత్రం నిమ్మరసం,గ్లూకోస్ అందిస్తామని ఇవన్నీ మా మిత్రులు సహాయ సహకారాలతో చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు సహాయ సహకారములు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ ఈ కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాల క్రీడామైదానం నుండి ఎంతో మంది జిల్లా రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులు తయారయ్యారని, ఈ వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు ఉంటుందని. నిష్ణాతులైన మహమ్మద్ అస్లాం, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు కోచ్ లు గా వ్యవహరిస్తారని అన్నారు.

## మరుగుదొడ్డి ఏర్పాటు చేసి మానవత్వం చాటుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు



**బద్వేల్ ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ నియోజకవర్గంలోని కాశినాయన మండలం నర్సాపురం గ్రామానికి చెందిన గోసల సుబ్బమ్మ,అనే మహిళ పూసలమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఐదు సంవత్సరాలుగా షుగర్ వ్యాధితో బాధపడుతుంది.షుగర్ ఎక్కువయ్యి కాలు పూర్తిగా దెబ్బతిని జీవనాధారం కోల్పోయింది.ఈ విషయం తెలుసుకున్న మూలపల్లె పాఠశాల హెడ్మాస్టర్ చంద్రశేఖర్ ఇదివరకే ఆమె కుటుంబానికి నిత్యావసర సరుకులు,బట్టలు,ఐదు వేల రూపాయల నగదును సహాయంచేసి మానవత్వం చాటుకున్నాడు.ఇటీవల సుబ్బమ్మ మరుగుదొడ్డి లేక అవస్థపడుతుండడం గమనించి సొంత ఖర్చుతో దగ్గరుండి 30 వేల రూపాయలతో మరుగుదొడ్డి నిర్మించాడు..మా కష్టాలను గమనించి మాకు సహాయం చేయదలచి ముందుకొచ్చినందుకు సుబ్బమ్మ వారి కుటుంబం తరుపున ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కుప్పం మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన సెల్వరాజ్...

**శుభాకాంక్షలు తెలియజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు...**



**ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** కుప్పం మున్సిపల్ చైర్మన్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో చైర్మన్ గా ఎన్నికైన సెల్వరాజ్ కు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.. సోమవారం ఢిల్లీ నుంచి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం పనిచేసే వారికి తెలుగు దేశం పార్టీ సముచిత స్థానం కల్పించి, గౌరవిస్తుంది అనడానికి ఇదో నిదర్శనం అన్నారాయన.. బీసీ వర్గానికి చెందిన సెల్వరాజ్.., పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో.. కుప్పం పట్టణ అభివృద్ధికి కృషి చేసి.., ప్రజా సంక్షేమం కోరి కూటమి ప్రభుత్వం అమలుపరుస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , . ఆయన పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా.. ప్రజలకు సేవలందించి, మున్సిపల్ చైర్మన్ పదవికి వన్నె తీసుకురావాలన్నారు.

## ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ముమ్మరంగా ఆటో పత్రాలు తనిఖీలు.

**ఆర్టీవో అధికారిని ఎం ఉష.**



**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర** శృంగవరపుకోట పట్టణ కేంద్రంలో స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో సిబ్బందితో కలిసి ఆర్టీవో అధికారులు ఎస్.కోట కొత్తవలస మెయిన్ రోడ్ లో ఆటోలను తనిఖీ చేసి పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లకు ఫైన్లు వేయడం జరిగింది ఇందులో భాగంగా 115 ఆటోలను తనిఖీ చేయగా 11 ఆటోలకు ఫైన్స్ వేసి, ఎనిమిది ఆటోలను తగిన పత్రాలు లేని కారణంగా సీజ్ చేశారు, తద్వారా 1,20,000 రూపాయల ఫైన్లు వేయడం జరిగింది .అనంతరం ఆటో డ్రైవర్లకు పరిమితికి లోపే ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోవాలని కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని ఆర్టీవో అధికారిని ఎం ఉష తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కే రమేష్ మరియు డిపో సిబ్బంది ఆర్టీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కారు కంటైనర్ ఢీకొట్టడంతో ఐదుగురు స్పాట్ డెడ్...





**ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి, పాకాల మండలం తోటపల్లి వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాకాల పోలీసులు తెలిపిన వివరాల మేరకు తమిళనాడు హొసూరుకు ఓకే కుటుంబానికి చెందిన వారు కారులో ప్రయాణిస్తూ ఉండగా ముందర వెళుతున్న కంటైనర్ను ప్రమాదవశాత్తు ఢీకొనడంతో కారు కంటైనర్ కిందకు వెళ్ళి నుజ్జు నుజ్జు అయ్యింది. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఐదు మంది స్పాట్ లోనే చనిపోగా ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. చనిపోయిన వారిలో ఇద్దరు ఆడవారు ఇద్దరు మగవారు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చనిపోయిన వారిని పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. కాగా అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు.

## ఎస్వీయూ డిగ్రీ ఎక్సమ్ వాయిదా...



**ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో స్వల్ప మార్పు జరిగింది. 30/4/2025 తేదీన జరగవలసిన పరీక్ష 15/5/2025 తేదీ నిర్వహించ బోతున్నట్లు యస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి డా? రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పాలిటెక్నిక్ ఎంట్రన్స్-2025 పరీక్ష కారణంగా ఈ పరీక్ష వాయిదా వేస్తున్నామని వారు తెలిపారు.

# ఉగ్రదాడిని నిరసిస్తూ గుంతకల్లు న్యాయవాదులు బైక్ ర్యాలీ




గుంతకల్లు ఏప్రిల్ 28 (ప్రజా తేజమ్): జమ్మూ కాశ్మీర్, పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ గుంతకల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి పట్టణం నందు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కసాపురం రోడ్డు గుండా, మార్కెట్ రోడ్ లో ఎన్టీఆర్ సర్కిల్ మెయిన్ రోడ్డు పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి గాంధీ చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. జాతీయ జెండాలు పట్టుకొని, ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ, స్లొగన్స్ ఇవ్వడం జరిగింది. కేంద్రం గట్టి చర్య తీసుకొని ఉగ్రవాదాన్ని అణిచివేయాల ని ఈ సందర్భంగా న్యాయవా దులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్, న్యాయవాది డాక్టర్ బిఎస్ కృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు హునుస్ అహ్మద్, గోపాల్ కృష్ణ, శివరావు, సురేష్ కుమార్, ఏజిపి హేమాద్రి, సీనియర్ న్యాయవాదులు రజబ్ వలి, నాగ శేషు, లక్ష్మీనారాయణ, పత్తికొండ నాగరాజు, చంద్రశేఖర్, తిమ్మప్ప, జిపి. తిమ్మారెడ్డి, ధనుంజయ, రమేష్, సురేష్, రవీంద్ర కుమార్, రాజశేఖర్, విద్యాసాగర్, ఆరిఫ్, శ్యామల, తాజుద్దీన్, పటాన్, తదితరులు న్యాయవాదులు గాంధీ చౌక్ నందు సమావేశమై ఉగ్రవాదుల దాడిని ముక్తకంఠంతో ఖండించారు.

# తాళ్లపూడి ముస్లిం కమిటీ, ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ శాంతి ర్యాలీ




**తూర్పుగోదావరిజిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్28 ప్రజాజ్యోతి న్యూస్** మానవత్వానికి మించిన మతం లేదని ఉగ్రవాదానికి మతానికి సంబంధం లేదని రాష్ట్ర నూర్ బాషా బీసీ సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్, మస్జిద్ గౌరవ అధ్యక్షులు రఫీ వివరించారు. ఈ నేపథ్యంలో తాళ్లపూడి మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. జమ్మూ కాశ్మీర్ పహల్గం లో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా త్రివర్ణ పతకాలు చేతపట్టి తాళ్లపూడి మసీదు నుండి బస్టాండ్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఉగ్రదాడి లో మరణించిన వారి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. భారత్ కి మద్దతుగా ప్రేమగా ఐక్యత గా నిలిపేందుకు ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. కాశ్మీర్లో లోనీ పహాల్గామ్ లో పర్యాటకుల పై ఉగ్రవాదులు దాడిచేసి దారుణంగా చంపడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఈ దాడుల్లో 29 మంది అమాయకులను మతం పేరుతో చంపి కుల మతాల మధ్య చిచ్చు పెట్టె ఇలాంటి ఉగ్రదాడులు చేసిన వారికి మరణ శిక్షలు పడాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.
దేశంలోని ప్రజలు అందరూ స్వేచ్ఛ, స్వతంత్రంగా తిరగాలంటే ఇటువంటి ఉగ్రవాదుల దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. శాంతి మార్గంలో పయనిస్తున్న భారత్ పై భారతీయులపై మతం పేరిట మారణకాండకు పాల్పడిన పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకుంటుంది అన్నారు. ఈ మారణ కాండ కు భారత్ తగిన గుణపాఠం చెబుతుందని పాకిస్థాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. ఖబర్దార్ పాకిస్తాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫసిఉల్లాబేగ్ మస్జిద్ కమిటీ సభ్యులు సర్దార్, షరీఫ్, బాషా, కుదాన్, ఆలీ, ఇస్మాయిల్, అన్వర్, రజాక్, ఉమర్, సబీర్ తదితరులు పాల్గొన్నారు

## ఉన్నత లక్ష్యాలు సాధించండి...
## పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే సూచన...



**ఏప్రిల్ 28, (ప్రజాజ్యోతి), తిరుపతి జిల్లా ప్రతినిధి** విద్యార్థులు చిన్నతనం నుంచి ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటే ఉన్నత స్థానానికి వెళతారని సూచించారు. ఆశయాలను నెరవేర్చుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలను ఉపాధ్యాయుల నుంచి తీసుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సహకారం అందిస్తానని, ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చెంచయ్య నాయుడు, వెంకట సుబ్బారెడ్డి, స్థానిక ఆర్టీవో భాను ప్రకాష్ రెడ్డి కూడా పాల్గొన్నారు...

## ధర్మవరం గ్రామంలో మురళిరాజు పర్యటన

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్... ప్రత్తిపాడు నియోజకవర్గం,**






వీర్రాజు గారి భార్యను పలకరించిన మురళిరాజు ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో బలిజి వీర్రాజు భార్య ఇటీవల కాలంలో హార్ట్ సమస్యతో బాధపడుతున్నారని తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొని ఆందోళన చెందవద్దని చెప్పి మెరుగైన వైద్యం గురించి కి డాక్టర్స్ ను సంప్రదిస్తానని చెప్పిన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ %డ% ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు ,కోలా తాతబాబు ,బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు ,పోకనాటి వెంకటేశ్వరరావు ,కోన బాబ్జి ,గుమ్మిడి రామకృష్ణ ,నల్ల వెంకటేష్ ,కుప్పిన శ్రీను, పెండ్యాల అబ్బు ,కుప్పిన నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు

## జిన్నూరు శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు.



**పోడూరు ఏప్రిల్ 28. ప్రజాజ్యోతి న్యూస్.** పోడూరు మండలంలోని జిన్నూరు శాఖ గ్రంధాలయంలో జిల్లా గ్రంధాలయ సంస్థ ఆదేశాల మేరకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. గ్రంధాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సెలవులలో విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా గ్రంధాలయానికి వచ్చి విజ్ఞాన పరమైన అంశాలను అధ్యయనం చేయడానికి ఉపయోగించుకోవాలన్నారు. %అ% గ్రంధాలయాదికారిణి బత్తుల జోగారత్నం మాట్లాడుతూ జూన్ నెల 6 వరకూ నిర్వహించే ఈ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన విజ్ఞాన, వినోద, శాస్త్రీయ పుస్తకాలు గ్రంధాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటి రోజు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఎమ్మార్పీ కె భారతి జనరల్ నాలెడ్జికి సంబంధించిన అంశాలను విద్యార్థులకు బోధించారు. తాళబత్తుల కుమారి, బండారు వెంకటరమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన టీడీపీ నాయకులు నామా కొండబాబు



**తూర్పుగోదావరిజిల్లా, తాళ్లపూడిమండలం, ఏప్రిల్28, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామ నివాసి తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త ఎలిపే. లాజర్ 70 సంవత్సరాలలు ఇటీవల కాలంలో ఆకస్మిక మరణం పొందారు. మరణించిన విషయం తెలుసుతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నామా వెంకట సుబ్బారావు (కొండబాబు) సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట జిల్లా తెలుగు యువత నాయకులుసిద్ధన రాధాకృష్ణ, గ్రామ టిడిపి అధ్యక్షుడు తిరుమలశెట్టిసత్యనారాయణ, రాంబాబు, చిట్టిదొర, లక్ష్మణ్ కుమార్, కరుణాకర్, వీర వెంకటరావు, ప్రసాద్ తదితరులుపరామర్శించిన వారిలో ఉన్నారు

## ఉపాధి పనికి వేసవి భత్యం పునరుద్ధరించాలి.సిపిఎం



**పోడూరు /పెనుగొండ, ఏప్రిల్ 28, ప్రజాజ్యోతి న్యూస్** .ఉపాధి పనికి వేసవి భత్యం పునరుద్ధించాలని, అడిగిన వారందరికీ పని కల్పించాలని, వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్స్ పై రాజకీయ వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సోమవారం డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి నిధులు తగ్గించడం ద్వారా కూలీలు రెండు పూటలా పనిచేయాలని, వేసవి భత్యం రద్దు చేస్తామని ప్రకటించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ సంఘం వ్యవసాయ కార్మిక సంఘం పెనుగొండ మండల కార్యదర్శి ఎస్కే పాదుషా అన్నారు. సోమవారం సిద్ధాంతం పరిసర ప్రాంతాలలో ఉపాధి కూలీలను కలిసిన సందర్భంలో వేసవి భత్యం మరియు త్రాగునీరు, తాత్కాలిక నీడ, ప్రథమ చికిత్స పెట్టే వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ఉపాధి హామీ పని పట్ల నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. ఇటీవల గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ మరియు మేట్స్ పై రాజకీయ వేధింపులు పెరిగాయని వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించడం ద్వారా కూలీల కోసం వచ్చిన నిధులను కాంట్రాక్టర్లకు, దళారీలకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. కాబట్టి పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని మనం అందరం కాపాడుకోవాలని ఈ సందర్భంగా కూలీలకు పిలుపునిచ్చారు.

## ఏబీవీపీ గుంతకల్లు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పాల్ సెట్ కోచింగ్ తరగతులు పూర్తి





**గుంతకల్లు ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి):** అఖిల భారత విద్యార్థ పరిషత్ (ఏబీవీపీ) గుంతకల్లు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో సిద్ధార్థ జూనియర్ కాలేజ్ లో 29 రోజులు పాటు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ తరగతులు సోమవారంతో పూర్తి అయినయి, ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఏబీవీపీ అంటే కేవలం ఉద్యమాలే ధర్నాలే కాకుండా ఇలాంటి సేవ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తాం. ఈ కార్యక్రమానికి సహకరించిన ఈ కోచింగ్ కి అకాడమీషన్ ఇచ్చిన ప్రభాకర్ కి ప్రత్యేక ధన్యవాదాలు అదేవిధంగా ఈ కోచింగ్ కి సహకరించిన ప్రతి ఒక్కరుకు ధన్యవాదాలు అని తెలియడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, నగర సహాయ కార్యదర్శి వంశీ, నగర ఉపాధ్యక్షులు వసీంఖాన్, కార్యకర్తలు విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

## గోదావరి మేరీ మాత పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్న మాజిమంత్రి కే.ఎస్. జవహర్



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్28 ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం వేగశ్వరపురం గ్రామంలో గోదావరి మేరీమాత పుణ్య క్షేత్రం నందు 28 నుండి 30 వ తేదీ వరకుజరుగుచున్న గోదావరి నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్య క్షేత్ర ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసిన టిడిపి మాజీ మంత్రి , జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్షులుకె.ఎస్ జవహర్ఈ సందర్భంగా నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్య క్షేత్ర డైరెక్టర్ రెవ.ఫా. టి. జాన్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేకమంది భక్తులు వచ్చి భక్తిశ్రద్ధలతో ప్రార్థన నిర్వహించి పాలుపంచుకుంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో రెవ.ఫా. జాన్ కిషోర్, రెవ.ఫా. ఏసు రాజు మరియు సిస్టర్స్, రాష్ట్ర తెలుగు రైతు కార్య నిర్వహక కార్యదర్శి పసలపూడి. సుభాష్ చంద్రబోస్ ,జిల్లా తెలుగు యువత నాయకులు నామా.సురేంద్ర కుమార్, గెల్లా పాపారావు , తిగిరిపల్లి శ్రీనివాస్ , మెరిపో వెంకట్రావు , కొప్పాక నరసయ్య , కొడమంచిలి ఇమ్ము, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటనకు గుడివాడ ఇన్చార్జిగా కే.ఎస్. జవహర్



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్28 ప్రజాజ్యోతి న్యూస్** అమరావతి నిర్మాణంలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలనుప్రారంభించడానికి గుడివాడ వస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన కార్యక్రమాలకు ఇన్చార్జ్ గా మాజీ మంత్రి కేఎస్ జవహర్ ను పార్టీ నియమించింది.
ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి జవహర్ కు ఉత్తర్వులు అందాయి. కొవ్వూరు నుండి గుడివాడ కు బయలుదేరిన జవహర్. మోదీ పర్యటన విజయవంతం కావడానికి గుడివాడ నియోజకవర్గం సీనియర్ రాజకీయ నాయకులను సంప్రదించి పెద్ద సంఖ్యలో రాజకీయ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను హాజరయ్యేలా కృషి చేస్తానని జవహర్ అన్నారు

## ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతి చెందారు.

సిఎంఓ ఆదేశాల మేరకు ఘటన స్థలానికి వెళ్లి ప్రమాద తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్






**ఏప్రిల్ 28, (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి జిల్లా పాకాల మండలం తోటపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.సిఎంఓ ఆదేశాల మేరకు ఘటన స్థలానికి హుటాహుటిన వెళ్లి జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు తో కలిసి ప్రమాద తీరును పరిశీలించి, స్విమ్స్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సందర్శించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఉంటామని, క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు.

## సింగల్ యూజ్ ప్లాస్టిక్ అమలును కఠినంగా చేపట్టాలి

: జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



**అనంతపురం, ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి):** అనంతపురం నగరంలో, మున్సిపాలిటీల పరిధిలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ అమలును కఠినంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సం బంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సింగల్ యూజ్ ప్లాస్టిక్ అమలుపై సంబంధిత శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగల్ యూజ్ ప్లాస్టిక్ అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు.ఇందుకు సంబంధించి అర్బన్ మరియు వార్డు స్థాయి కమిటీలను 24 గంటల్లోగా నియమించాల న్నారు.నగరంలో 56 మంది ట్రేడర్స్ ని ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందితో నిత్యం తనిఖీలు చేయాలని, ఫైన్ లు వేయాల ని,మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లపై రోజువారీగా దాడులకు సంబంధించిన నివేదికలు అందజేయాలని, అందరికీ నోటీసులు జారీ చేసి 7 రోజుల సమయం ఇవ్వాల ని,ఈ వారంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ అమలుపై వారితో సమావేశం నిర్వహించాలన్నారు. ఎక్కడ సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకుండా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నా రు.నగరంలో ప్లాస్టిక్ ఉపయోగించుకుండా చూడాలని, డ్రైన్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, నగర పాలక సంస్థ కమిషనర్ బాలరాజు, నగర పాలక సంస్థ ఈఈ షాకిర్ హుస్సేని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ, డిస్కవర్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద పదవీ విరమణ...

సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే సుభాషిని...








**బాపట్ల ఏప్రిల్ 28( ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుభాషిణి సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు సోమవారం స్థానిక కలెక్టరేట్ లో సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిని స్వచ్ఛంద పదవి విరమణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల పదవీ విరమణలు సామాన్యమని అయినప్పటికీ పది విరమణ చేయడం కొంత బాధగా ఉంటుందని పేర్కొన్నారు సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిని కొల్లూరు వరద సమయంలో మహిళా అధికారి అయినప్పటికీ చాలా కష్టపడి పని చేశారని కలెక్టర్ కొనియాడారు. సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిని శేష జీవితం సంతోషంగా ఆనందం గా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్ దిబోరా, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లావ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ , జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ , తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లేదూ... సంక్షేమం లేదు






- కూటమి పాలనలో రాష్ట్రం అధోగతి
- పథకాలను ఎగ్గొట్టి కాలయాపన చేస్తున్న కూటమి
- కూటమి పాలనపై ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తున్న వ్యతిరేకత
- పార్టీని ప్రజల్లో మరింత పటిష్టం చేయాలి
- కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్దాం
- 2029 లో వైకాపా అధికారం లోకి వచ్చి తీరుతుంది
- తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైకాపా జిల్లా అధికార ప్రతినిధుల వర్క్ షాప్ లో పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా వైకాపా అధికార ప్రతినిధి కోట గోవింద రావు

ఆమదాలవలస ,ప్రజా జ్యోతి న్యూస్ : బూటకపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి హయంలో అభివృద్ధి లేక సంక్షేమం లేక రాష్ట్రం అధోగతి పాలైందని శ్రీకాకుళం జిల్లా వైకాపా అధికార ప్రతినిధి కోట గోవింద రావు అన్నారు. విజయవాడ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధులతో వర్క్ షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు పాల్గొన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గ పరిస్థితులపై , పార్టీ పటిష్టత గురించి గోవింద రావు చర్చించగా ఆయన పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా సమావేశంలో సజ్జల రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రంలో రోజురోజుకీ దుర్మార్గాలు , అరాచకాలు , దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నాయన్నారు. వైసిపి నేతలే టార్గెట్ గా బెదిరింపులకు గురి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని సూచించారు. ప్రతీ జిల్లాల్లో వైకాపా నాయకులకు,కార్యకర్తలకు పూర్తి భరోసా కల్పించాలని కార్యకర్తలకు వైకాపా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతమే ధ్యేయంగా ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేసేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం కోట గోవింద రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక సంపద సృష్టి పేరుతో తప్పించుకోవడం కూటమి అసమర్థ పాలనను నిదర్శనము అని తెలిపారు. సామాజిక న్యాయాన్ని ఆచరణ లోకి చూపిన పార్టీ ఒక్క వైసిపి పార్టీనే అని కొనియాడారు. హామీలు కేవలం మాటలకు మాత్రమే పరితమం కాకుండా ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని ప్రజల గడప వద్దకే అందించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోఅభివృద్ధి , ప్రతీ ఇంటా సంక్షేమం వెల్లివిరిశాయన్నారు.అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబుది అవకాశవాద రాజకీయం అని , అధికారం చేపట్టిన నాటి నుండి దోచుకోవడమే కూటమి నేతల పాలన అని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు చెప్పని ఎన్నో హామీలను ప్రజలకు అందించారన్నారు.. పది నెలల కూటమి పాలనకు గతంలో వైకాపా పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని ప్రజల గుండెల్లో వైకాపా స్థానం ఎప్పటికీ సుస్థిరం అని పేర్కొన్నారు. కూటమి అరాచకాలను , దౌర్జన్యాలను , అసమర్థతను , వైఫల్యాలను ప్రతీ ఒక్కరం ప్రజల్లోకి తీసుకువెళ్దామని పిలుపునిచ్చారు . వైకాపా పార్టీ పుట్టిందే ప్రజల కోసం అనే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు ప్రతీ ఒక్క కార్యకర్తను సిద్ధం చేస్తూ సైన్యం లా కృషి చేద్దామని తెలిపారు. పార్టీ బలోపేతమే ప్రతీ ఒక్కరి ధ్యేయమని ,అదే దిశగా ముందుకు సాగాలని తెలిపారు.2029 ఎన్నికల్లో మరలా అధికారంలోకి వచ్చేది వైకాపా ప్రభుత్వమే అని స్పష్టం చేశారు.

# గుంతకల్లు గ్రంథాలయ ఉచిత వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

**గుంతకల్లు ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు గ్రంధాలయంలో నిర్వహించే వేసవి ఉచిత శిక్షణ శిబిరంలోను సద్వినియోగం చేసుకోవాలని గుంతకల్ గ్రంథాలయ శాఖ అధికారి పి. కమ్మన్న తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం గ్రంధాలయాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి అందులో భాగంగా గుంతకల్లు శాఖా గ్రంధాలయం నందు సోమవారం ఉచిత వేసవి శిక్షణ శిబిరం ను ఘనంగా ప్రారంభించారు.ఈ ప్రారంభ కార్యక్రమానికి గుంతకల్లు గ్రంధాలయాధికారి పి.కమ్మన్న అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా గుంతకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర రావు,రిసోర్స్ పర్సన్ కళ్యాణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రంధాలయాధి కారి కమ్మన్న మాసట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతు న్న గ్రంధాలయాలలో వేసవి శిక్షణ శిబిరము ల లో భాగంగా గుంతకల్లు శాఖా గ్రంధాలయం లో కూడా ఘనంగా నిర్వహించు చున్నాము అని తెలిపారు. ఇందులో భాగంగా చిత్రలేఖనము,తెలుగు చదువుట రాయించుట, గణితం లో మెలకువలు మొదలగు వాటిలో శిక్షణ ఇవ్వడం జరిగింది. వెంకటేశ్వరరావు మార్లడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ శిభిరాలను పిల్లకు సద్వినియోగం చేసుకోవాలని




కోరారు.ఈ కార్యక్రమం నందు గ్రంధాలయ సిబ్బంది ఎం. హేమలత గ్రంధాలయంధి కారిణి,సిబ్బంది సి రాము పాఠకులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన రీతులు అర్జీలు పరిష్కరించాలి

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి...

**బాపట్ల ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల, జిల్లాలో సోమవారం స్థానిక కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి నిర్వహించారు జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు అర్జీల రూపంలో కలెక్టర్ కు అందజేశారు అర్జీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు అర్జీలు అందించిన ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ప్రజల సంతృప్తి మేరకు పరిష్కరించాలని ఆయన అధికారులకు చెప్పారు జిల్లాలో పబ్లిక్ ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు జిల్లాలో పబ్లిక్ ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన పెన్షన్లు, గృహాలు, ఇంటి పట్టాలు, బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని అధికారులకు సూచించారు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మహిళలకు రుణాలు అందించ డానికి 12వేల500 పాడి గేదెల పెంపకం యూనిట్లు ప్రజలకు అందించే కార్యక్రమం ఉందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో పబ్లిక్ ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యంతో అమలు చేసే కార్యక్రమంలో ప్రతి మండలంలో 500 మందిని గుర్తించి



బ్యాంకు రుణాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధామాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజె దిబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన మురికి నీటి కాలువ పనులు చేపట్టిన అధికారులు...



**బాపట్ల ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల పట్టణంలో మురికి నీటి ప్రధాన కాలువ (డ్రైనేజీ) పూడికలు తొలగించే పనులు చేపట్టిన మున్సిపాలిటీ అధికారులు బాపట్ల పట్టణం మున్సిపాలిటీ కమిషనర్ జి రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మున్సిపాలిటీ పరిధిలో డి ఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 1వార్డ్ నుండి 20 వార్డ్ వరకు మెయిన్ డ్రైనేజీ కాలువలు (శిల్ట్) బురద పూడిక తీసి మట్టి తొలగించే కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా డి ఈ మాట్లాడుతూ డ్రైనేజీ కాలువ లో ఎలాంటి చెత్త మట్టి అడ్డుపడకుండా వాటర్ పోయేవిధంగా చర్యలు చేపట్టామని చెప్పారు వచ్చే వర్షాకాలానికి బాపట్ల పట్టణంలో ఎక్కడ వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపడుతున్నామని డి ఈ తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రసాదరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రజల దాహార్తిని తీర్చిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు.



**పాతపట్నం ఏప్రిల్ 28, ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నంమండల కేంద్రంలోని నీలకంఠాపురంవీధి, బాలాజీనగర్లో నివాసితులకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న శాసనసభ్యులు మామిడి గోవిందరావు స్పందించారు. సోమవారం మామిడి అప్పారావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మంచినీటి ట్యాంకర్ను పంపించి తాగునీటిని సరఫరా చేశారు. వాటర్ ట్యాంకర్లను పంపి తాగునీటిని సరఫరా చేసిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు బాలాజీ నగర్, నీలకంఠాపురం వీధి నివాసితులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పైల బాబి, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, టౌన్ ప్రధాన కార్యదర్శి అక్కంద్ర సన్యాసిరావు, సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు, ఎంజీఆర్ యువసేన సభ్యులు యలకల వాసుదేవరావు, మేజర్ పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కంచి కామకోటి పీఠాధిపతిగా ఏపీ వాసి...



**అన్నవరం ఏప్రిల్ 28 ప్రజాజ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** ప్రత్తిపాడు నియోజవర్గం అన్నవరం కంచి కామకోటి 71వ పీఠాధిపతిగా ఏపీ వాసి అన్నవరం గ్రామానికి చెందిన గణేష్ శర్మ ఏసు 27 ఏళ్లు కంచి కామకోటి పీఠాధిపతిగా సోమవారం ఎంపికవడంపై అన్నవరం గ్రామం బ్రాహ్మణ సంఘాలు గ్రామస్తులు వారికి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం మన అన్నవరం గ్రామం నుంచి పీఠాధిపతిగా ఎంపిక కావడం పట్ల బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్న రు. ప్రస్తుత పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఈ నెల 30వ తేదీన సన్యాస దీక్షను ఇవ్వనున్నారు. ధన్వంతరి మంగాదేవిల పెద్ద కుమారుడైన గణేష్ శర్మ 2006 వేద అధ్యయన దీక్షను స్వీకరించారు. వేదాలు షడంగాలు దాసోపనిషత్ దశోప నిషత్తులు అభ్యసించారు.

## అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్...




**అన్నవరం ఏప్రిల్ 28 ప్రజాజ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి** కాకినాడ జిల్లా ప్రతిపాడు నియోజకవర్గం అన్నవరం సత్యదేవుని సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దంపతులు సోమవారం సత్య దేవి వ్రతం ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు తదానంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజుకు ఆలయ అధికారులు ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు ఇప్పించి స్వామివారి జ్ఞాపికను ప్రసాదాలను ఆలయ అధికారులు డిప్యూటీ స్పీకర్ కు అందజేశారు

## సంస్కార శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం:డీఎస్పీ బాలిరెడ్డి.

వేసవి శిబిరానికి అద్భుతమైన స్పందన లభించింది




**ఏప్రిల్ 28, (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కార శిబిరం 2025 వేసవి శిబిరాన్ని సోమవారం వివేకానంద సభ్హాంగణంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ డీఎస్పీ జి.బాలిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత అవసరమని, అందుకు యోగా చేయాలన్నారు. వేసవి సెలవుల్లో శిక్షణ కార్యక్రమాల ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధించవచ్చన్నారు. వీటి ద్వారా కొన్ని సమస్యలను స్వయంగా పరిష్కరించుకునే పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చు. ఏది జరిగినా అది మన మంచికే అని ఆలోచించే స్వభావం కలిగి ఉండాలని ఆయన నీతి కథలను ఉదహరించారు. భారతీయ విద్యాభవన్ శ్రీ వేంకటేశ్వర విద్యాలయ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ శిబిరాలకు హాజరైన పలువురు విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లారన్నారు. విద్యార్థులకు ఉత్తమ విలువలు అందించేందుకు రామకృష్ణ మిషన్ కృషి చేస్తోందని కొనియాడారు. రామకృష్ణ మిషన్ పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సెక్రటరీ స్వామి సుకృతానంద జీ మహరాజ్ మాట్లాడుతూ.. 1897 మే 1న మిషన్ ప్రారంభమైందని.. యువతలో స్వామి వివేకానంద స్ఫూర్తి నింపారన్నారు. 2015 నుంచి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామని.. గురువు స్థానంలో భారతదేశం ఉండాలని స్వామి వివేకానంద చెప్పారని గుర్తు చేశారు. వేదాలు మన సంస్కృతికి సంబంధించినవని అన్నారు. ఏకాగ్రతతో లక్ష్యాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ స్వామీజీలు, వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 44 పిర్యాదులు

**బాపట్ల ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ జిల్లా పోలిస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీ దారుల వ్రాతపూర్వక అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వయంగా



స్వీకరించారు. ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు. ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు తగిన చర్యలు తీసుకోని, భాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యల పై 44 అర్జీలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్.ఐ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


## త్రాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని ట్యాంకర్ ద్వారా మంచినీళ్ల సరఫరా చేయించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు..



**పాతపట్నం ఏప్రిల్ 28, ప్రజా జ్యోతి న్యూస్.** పాతపట్నం మండల కేంద్రంలోని నీలకంఠాపురంవీధి, బాలాజీనగర్ లో నివాసితులకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న శాసనసభ్యులు మామిడి గోవిందరావు వెంటనే స్పందించి, సోమవారం మామిడి అప్పారావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మంచినీటి ట్యాంకర్ను పంపించి తాగునీటిని సరఫరా చేశారు. వాటర్ ట్యాంకర్లను పంపి తాగునీటిని సరఫరా చేసిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు బాలాజీ నగర్, నీలకంఠాపురం వీధి నివాసితులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పైల బాబి, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, టౌన్ ప్రధాన కార్యదర్శి అక్కంద్ర సన్యాసిరావు, సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు, ఎంజీఆర్ యువసేన సభ్యులు యలకల వాసుదేవరావు, మేజర్ పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

## కడప జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్‌గా మంచూరు సూర్యనారాయణ రెడ్డి

**బద్వేల్ ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి న్యూస్)**



కడప జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ గా ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ టిడిపి సీనియర్ నాయకులు మంచూరు సూర్యనారాయణ రెడ్డి గారు నియమితులైన సందర్భంగా బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి ఎన్జీవో కాలనీ వద్ద వారి అభిమానులు భారీగా బాణాసంచ కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. టిడిపి బద్వేలు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మాచుపల్లి లక్ష్మీదేవి శాలవా పూలమాలతో సత్కరించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాచుపల్లి వెంకటకృష్ణారెడ్డి (బుల్లెట్ కృష్ణారెడ్డి) టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజా...

**అన్నవరం ఏప్రిల్ 28 ప్రజాజ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** తుని నియోజకవర్గం



తుని నియోజకవర్గం అగ్రహారం గ్రామం లో చెక్క వారి పరిశుద్ధ వివాహ మహోత్సవ కార్యక్రమం లో మాజీ మంత్రివర్యులు కాకినాడ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు దాడిశెట్టి రాజా మరియు యనమల కృష్ణుడు ఎంపీపీ లగుడు శ్రీనివాస్ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ జీ. రామచంద్ర రావు మాజీ జెడ్పిటిసి వి.రాజబాబు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు..

## నీటి సరఫరా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన - మునిసిపల్ కమీషనర్




**బద్వేల్ ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పురపాలక కార్యాలయం వద్ద నీటి సరఫరా చేయు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన మునిసిపల్ కమీషనర్ వి.వి.నరసింహారెడ్డి. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎక్కడ కూడా వాటర్ లీకేజీలు లేకుండా చూడటంతో పాటు నీరు ఎట్టి పరిస్థితుల్లో కలుషితం కాకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరా చేయు సిబ్బంది తరచుగా క్లోరిన్ టెస్ట్ చేస్తూ అవసరమైన జాగ్రతలు తీసుకుంటూ ఉండాలన్నారు. నీరు సరఫరా చేయు సిబ్బంది నిత్యం తిరుగుతూ కుళాయిల దగ్గర పైప్ జాయింట్ల దగ్గర నీరు లీకేజీ జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలకు కూడా అవగాహన కల్పించి నీరు వృధా కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నీరు వృధా చేయకుండా అవసరం మేరకు వాడుకోవాలన్నారు. అక్రమ కుళాయిలు అన్నీ కూడా రెగ్యులర్ చేయించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మునిసిపల్ కమీషనర్ తో పాటు అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.


## నాయకులను అభినందిస్తున్నా



**ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రజా జ్యోతి రిపోర్టర్ బిఎస్సి ప్రసాద్** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, గౌరవ శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్య ప్రభ రాజా గారి సూచనలతో ఈరోజు ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లతో సమావేశం నిర్వహించిన నియోజకవర్గ పరిశీలకులు శ్రీ మెట్ల రమణబాబు గారు. ఈ సందర్భంగా రమణబాబు మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన "కుటుంబ సాధికార సారథులు ల నియామకాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలోను, రాష్ట్రంలో 6 వ స్థానంలోను నిలిచిందని అన్నారు. అందుకు సహకరించిన నాయకులను అభినందిస్తున్నానని అన్నారు. అలాగే గౌరవ శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్య ప్రభ రాజా గారి నాయకత్వంలో బూత్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల నియామకాల్లో మనమంతా చురుగ్గా పాల్గొందామని అన్నారు. ఈ సమావేశంలో ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) గారు, ఏలేశ్వరం మండల పార్టీ అధ్యక్షులు సూతి అప్పలరాజు (బూరయ్య) గారు, మాజీ జెడ్పీటీసీ జ్యోతుల పెదబాబు గారు, ప్రత్తిపాడు మండల పార్టీ అధ్యక్షులు అమరాది వెంకట్రావు గారు, శంఖవరం మండల పార్టీ అధ్యక్షులు బద్ధి రామారావు గారు, నియోజకవర్గ సిబిఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్ గారు, క్లస్టర్ ఇంచార్జ్ లు బద్ధి రమణ గారు, సింహాద్రి పెదబాబు గారు, పల్లా గోపి గారు మరియు యూనిట్ ఇంచార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్థానీయులకు ఆశ్రయం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**బాపట్ల ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాలో ఎవరైనా పాకిస్థానీయులు నివాసం ఉంటుంటే తక్షణం దేశం వదిలి వెళ్లాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటన వలన భారత్ పాక్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో, భారతీయ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పాకిస్తాన్ జాతీయుల వీసా లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందున పాకిస్తాన్ పౌరులు తక్షణం దేశం విడిచి వెళ్లాలని సోమవారం జిల్లా ఎస్పీ ఆదేశాలను జారీ చేసినారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో పాకిస్తానీలు అధికారికంగా ఎవరు లేరని



ఎవరైనా అక్రమంగా ఉన్నట్లయితే వెంటనే దేశం వదిలి వెళ్లాలని ఎస్పి తెలిపారు. లేనియెడల వీసా నిబంధనలు ఇతర చట్ట ఉల్లంఘనల కింద కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ కోణాలలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ వర్గాలు ఆరా తీస్తున్నాయన్నారు. తక్షణ వీసాలు, వ్యాపారం, సినిమా, జర్నలిజం, రవాణా, సమావేశాలు, పర్వతారోహణ, విద్యార్థి, సందర్శన(విజిటర్స్), బృంద పర్యటనలు(గ్రూప్ టూరిస్ట్), యాత్రిక(పిలిగ్రిమ్స్), పాకిస్తాన్ దేశీ యాత్రిక బృంద వీసాలు వంటి వాటిపై ఎవరైనా జిల్లాలో ఉంటే తక్షణం దేశం విడిచి వెళ్ళాలని ఎస్పీ తెలిపారు. పాకిస్తాన్ వీసాలతో ఎవరైనా అక్రమంగా నివసిస్తుంటే అట్టివారిపైన, అటువంటి వారికి ఆశ్రయం ఇచ్చిన వారిపైనా చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ శాఖ తీసుకుని చర్యలకు ప్రజలు సహకరించాలని ఎస్పి తెలిపారు.

# భద్రాద్రిలో యదేచ్ఛగా ఆక్రమణలు

**ఖమ్మం :** ఇప్పటి వరకు పట్టణాలకు, సమీప మండలాలకు పరిమితమైన భూకబ్జాలు తాజాగా ఏజెన్సీ గ్రామాలకు పాకింది. పాత తేదీలతో నకిలీ నాన్ జుడిషియల్ స్టాం ప్స్, ఫోర్జరీ సంతకాలు చేసి మరణించిన వారి పేరుతో ఉన్న భూములను కొనుగోలు చేసినట్లు భూ భకాసురులు భూకబ్జాలకు తెర లేపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గంగారం రెవెన్యూ గ్రామ పరిధిలో దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములపై కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలుస్తోంది.పాల్వంచకు చెంది న కేటీపీఎస్ డి ఈ స్థాయి అధికారితో పాటు స్థానికులు ఇద్దరు ఈ కబ్జాకు శ్రీకారం చుట్టారని ఆరోపణలు వెలబడుతున్నాయి. దీంతో బాధితులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే సంపత్ నగర్ కు చెందిన ఓ వృ ద్ధుడి భూమిపై కబ్జాదారులు కన్నేసి గంగా రం రెవెన్యూ పరిధిలోని సంపత్ నగర్ గ్రామం లో ఉన్న భూములను తప్పుడు పత్రాలతో కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించారని తెలుస్తోంది. 1970 కంటే ముందు నుంచి ఇక్కడ రైతులు వారి భూ ముల్లో సాగు చేసుకుంటున్నారు.రెవెన్యూ రికార్డులో రైతుల పేరు నమోదయి ఉంది. అట్టి భూ ములపై నకిలీ పత్రాలు సృష్టించి కేటీపీఎస్ లో డి ఈ గా విధులు నిర్వహిస్తు న్న అధికారి భూములను కొనుగోలు చేసినట్టు పాత తేదీల్లో తప్పుడు కాగితాలు సృ ష్టించి, అసలు రైతులను బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. అతనికి ఓ మా జీ రౌడీ షీటర్ , స్థానికులు ఒకరు పూర్తి సహా య సహకారాలు అందిస్తున్నట్లు సమాచా రం.ఏజెన్సీ చట్టాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ రికార్డుల్లో ఎలాంటి ఆధారాలు లేకున్నా, మరణించిన గిరిజనుల పేర్ల మీద పాత తేదీల పై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి స్థానిక రైతులను బెదిరిస్తున్నట్లు సర్వత్రా ఆరోపణలు వెలబడుతున్నాయి. స్థానికంగా ఉండే ఓ రౌడీ షీటర్ ప్రణాళికలు రూపొందించి ఈ తంతు కొనసాగిస్తున్నాడని సమా చారం.చనిపోయిన వారి పేరుతో ఉన్న భూములను కొనుగోలు చేసినట్లు నకిలీ నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లను, పాత తేదీలతో సృష్టించి కేటీపీఎస్ డి ఈ స్థాయి అధికారి కొనుగోలు చేసినట్లు పత్రాలను త యారుచేసి,



అధికారులను పక్కతో పట్టిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే 200 ఎకరాల కు పైగా ఇలాంటి నకిలీ నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లతో కబ్జాకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. గంగారం రెవెన్యూ పరిధిలోని సంపత్ నగర్ గ్రామంలో 50 సంవత్సరాల నుంచి అబ్బినేని సాంబశివరావు అనే వృద్ధ రైతు కు 12.08 ఎకరాల వ్యవసాయ భూమి సా గు చేసుకుంటున్నాడు. 1968 లో కొండపల్లి గోపాల్ రావు అనే వ్యక్తి నుంచి సాంబశివరావు కొనుగోలు చేసినట్లు పహనీలు ఉన్నా యి. అప్పటి నుంచి రెవెన్యూ రికార్డులో సాంబశివరావు పేరు కొనసాగుతోంది.ఆ భూమిపై కబ్జాకోరుల ముఠా కన్ను పడింది. మరణించిన రైతుల నుంచి కేటీపీఎస్ లో డీగా పనిచేస్తున్న అధికారి నకిలీ పత్రాలు సృష్టించి కొనుగోలు చేసినట్లు రికార్డులను తయారు చేశారు. 17 సంవత్సరాల క్రితం ఆ భూమి అమ్మకాలు, కొనుగోలు జరిగినట్లు రికార్డులు తయారు చేశారు.2008 సంవత్సరములో రెడ్డి రామయ్య నుంచి తాటి లక్ష్మయ్య కొనుగోలు చేసినట్టు ఒక నకిలీ స్టాంప్ పేపర్ పై ఫోర్జరీ సంతకాలు చేసి తప్పుడు పత్రాలు సిద్ధం చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుడివాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్టాంప్ పేపర్లను కొనుగోలు చేసినట్లు చూపించారు. అట్టి భూమిని 2017 లో కే టి పి ఎస్ డి ఈ కి అమ్మినట్లు మరొక నకిలీ పత్రాలను సృష్టించారు. రెడ్డి రామయ్య, తాటి లక్ష్మయ్యలు గతంలో ఎప్పు డో మరణించారు. వారి పేరుతో గుడివాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు సృష్టించడంతో కబ్జా కోరుల బండారం బహిర్గతమైంది. అసలు రైతు అబ్బినేని సాంబశివరావు, మనవడు స మాచార హక్కు చట్టం ద్వారా గుడివాడ సబ్ రిజిస్టార్ ను సమాచారం కోరగా, సదరు స్టాంప్ పేపర్ తమ కార్యాలయం పరిధిలోనిది కాదని, నకిలీదని సమాచారం ఇవ్వడం తో వాస్తవం వెలుగులోకి వచ్చింది.ఇదే తరహాలో సుమారు 200 ఎకరాలకు పైబడి తప్పుడు పత్రాలతో కబ్జాకోరులు భూముల ఆక్రమణకు పాల్పడుతున్నట్లు తేటతెలమైం ది. తన దగ్గర ఉన్న ఆధారాలతో సాంబశివరావు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జిల్లాస్థాయి అధికారులు కబ్జాకోరుల ఆగడాలను అరికట్టి తమ భూములకు రక్షణ కల్పించాలని గంగారం రెవెన్యూ పరిధిలోని రైతులు కోరుతున్నారు.

# భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ :** భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా పెండింగ్లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుందని, రైతుల భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.
సోమవారం వీణవంక మండలం చల్లూరులోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 రూపొందించిందని తెలిపారు. భూ భారతి చట్టం ప్రకారం సమస్యను సంబంధిత అధికారి ఎన్ని రోజులలో పరిష్కరించాలనే విషయమై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. అధికారి పరిష్కరించిన భూ సమస్యపై సంబంధిత అర్జీదారు సంతృప్తి చెందని పక్షంలో అప్పీలు వ్యవస్థను ఈ చట్టంలో పొందుపరిచారని తెలిపారు. కోర్టుకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు.
గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. గతంలో తహసిల్దార్ స్థాయిలో పరిష్కారం అయ్యే చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని అన్నారు. వేల సంఖ్యలో దరఖాస్తులు ఉండడంవల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కిందిస్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల చిన్న సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు.
భూ భారతి చట్టం ప్రకారం ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో



రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. భూమికి భూదార్ సంఖ్య కేటాయింపునకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలు అరికట్టవచ్చని అన్నారు.
ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. ధరణిలో ఇప్పటికే దరఖాస్తు చేసిన వారి సమస్యలన్నీ త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. భూ భారతిలో మ్యుటేషన్ దరఖాస్తుల పై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకే రోజు ఉంటాయని అన్నారు. కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగం పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ క్షేత్రస్థాయిలో విచారించి రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి రమేష బాబు, తహసిల్దార్ శ్రీనివాస్, వివిధ వర్గాల ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భూమి అంటే ఆత్మగౌరవం విశ్వాసం హక్కు

**హుస్నాబాద్ :** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లోని శ్రీ ఫంక్షన్ హాలులో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు.
హనుమకొండ రైతులకు భూమి అంటే ఆత్మగౌరవం, విశ్వాసం, హక్కు అని, రైతుల హక్కులను కాపాడేందుకే భూభారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని శ్రీ ఫంక్షన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం పై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా మార్గదర్శకాలను హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ చదివి వినిపించారు. భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు అడిగిన పలు భూ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్డీవో రాథోడ్ రమేష్, స్థానిక తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ సమాధానమి చ్చారు. భూభారతి చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. రైతులకు భూమి అంటే ఆత్మగౌరవం, విశ్వాసం, హక్కుగా భావిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలన్నీ నివారించేందుకే భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. మన వంగర వాసి, పూర్వ




ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో భూ సంస్కరణాలు తీసుకొచ్చారని అన్నారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ హయాంలో పట్వారి వ్యవస్థను రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం భూముల విలువలు పెరిగిన తర్వాత భూ సమస్యలు ఎక్కువయ్యాయని అన్నారు. ధరణి వచ్చిన తర్వాత అనేక కారణాల వల్ల రైతులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. భూభారతి చట్టం ద్వారా పారదర్శకంగా భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తుందన్నారు. భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఆధార్ కార్డు మాదిరిగానే భూదార్ కార్డును తీసుకు వస్తున్నట్లు తెలిపారు. భూమికి సంబంధించి స్పష్టమైన, ఎలాంటి విభేదాలు లేకుండా భూ భారతి చట్టం ద్వారా పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఉన్న 500 పైచిలుకు మండలాల్లో భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం రైతుల చుట్టం అని పేర్కొన్నారు. రైతులు ప్రజలు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. హక్కులు, గౌరవాన్ని బాధ్యతగా పొందడానికి ప్రభు త్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టంలోని మార్గదర్శకాలను తెలియజేసేందుకే అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే ద్వారా చుట్టుపక్కల రైతులకు నోటీసులు ఇచ్చి మోకాపై ఎంత విస్తీర్ణం ఉందో దాన్ని సర్వే చేస్తారని పేర్కొన్నారు. తప్పుగా ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలను క్యాన్సిల్ చేస్తామన్నారు. మ్యుటేషన్, విరాసత్ భూములకు సంబంధించి ఏర్పడిన ఇబ్బందులు కూడా ఈ చట్టం ద్వారా త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. సాదా బైనామాకు వచ్చిన దరఖాస్తులను ఆర్డీవో స్థాయిలో విచారణ జరిపించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. భూభారత్ చట్టంలోని మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా రైతులు ప్రజలకు సంబంధించిన భూ సమస్యలపై అర్జీలను అధికారులు స్వీకరించారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఎంపీడీవో వీరేశం, వ్యవసాయ అధికారిణి పద్మ, ఇతర అధికారులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## నీట్ యూజీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్



**బాపట్ల ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** నీట్ యూజీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నీట్ యూజీ 2025 జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ యు జి ప్రవేశ పరీక్షను మే 4 న జిల్లాలో చీరాల నందు గల యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించబడునన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. మొత్తం 416 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 11 గంటల నుండి విద్యార్థులను పరీక్ష కేంద్రం లోనికి అనుమతిస్తారని తెలిపారు. విద్యార్థులకు త్రాగడానికి నీళ్లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. పరీక్ష పేపర్లను తీసుకురావడానికి, పరీక్ష కేంద్రం వద్ద సెక్యూరిటీ కొరకు ఎంత మంది పోలీసు సిబ్బంది కావాలో తెలుపుతూ పోలీస్ శాఖ వారికి లేఖ వ్రాయాలని నీట్ యూజీ నోడల్ అధికారికి సూచించారు. పరీక్షా కేంద్రంలో ఎటువంటి మాస్ కాపీయింగ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలని నోడల్ అధికారిని ఆదేశించారు. పిడబ్ల్యుడి విద్యార్థుల కొరకు పరీక్షా కేంద్రంలో వీల్ చైర్లను, సహాయకులను ఏర్పాటు చేయాలని నోడల్ అధికారికి సూచించారు. పరీక్ష కేంద్రంలో సిబ్బంది అందరూ ఐడి కార్డులు ధరించాలన్నారు. నీట్ యూజీ 2025 పరీక్షలు సవ్యంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరిపేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విఠలేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు మరియు నీట్ యూజీ నోడల్ అధికారి మృదుల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ స్నేహలత, యార్లగడ్డ అన్నపూర్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయులు మురళి మరియు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీపై పసుపు జెండా రెపరెపలాడింది.



**తుని నియోజకవర్గం ప్రజా జ్యోతి రిపోర్టర్ బివిస్సి ప్రసాద్** తుని మున్సిపాలిటీపై పసుపు జెండా రెపరెపలాడింది.చైర్ పర్సన్ వైస్ చైర్మన్ పదవులు టీడీపీ ఖాతాలో పడ్డాయి.నార్ల భువన సుందరి చైర్ పర్సన్ పేరును కుచ్చర్ల పాటి రూపాదేవి ప్రతి పాదించగా,పులి సత్తిబాబు బలపరిచారు,ఇక వైస్ చైర్మన్ గా అచంట సురేష్ పేరును చింతకాయల భారతి ప్రతి పాదిస్తే వాసంశెట్టి శ్రీనివాస్ బలపరిచారు. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికన భువన సుందరి, ఆచంట సురేష్ లతో ఎన్నికల అధికారి రవికుమార్ ప్రమాణం చేయించారువాయిస్.తుని మున్సిపాల్టీని తెలుగు దేశం పార్టీ కైవసం చేసుకుంది.మూడు నెలల నుంచి నడుస్తున్న హైడ్రామాకు తెరపడింది.చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పదవులుతెలుగు దేశం ఖాతాలో పడ్డాయి.మొత్తమ్మీద తుని మున్సిపాల్టీ పై తెలుగు దేశం పార్టీ పాగా వేసింది.చైర్ పర్సన్ గా నార్ల భువన సుందరి, వైస్ చైర్మన్ గా అచంట సురేష్ ఎన్నికైయ్యారు. ఎన్నికల అధికారిగా డీపీవో రవికుమార్ ఎన్నికలను నిర్వహించారు.తెలుగుదేశంపార్టీకి చెందిన సభ్యులు ఎన్నికల కు హాజరు కాగా వైకాపా సభ్యులు డుమ్మా కొట్టారు.నార్ల భువన సుందరి పేరు చైర్ పర్సన్ పదవికి అచంట సురేష్ వైస్ చైర్మన్ పదవి ఒక్కొక్క పేరు మాత్రమే రావడంతో చైర్ పర్సన్ గా భువన సుందరి, వైస్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి రవికుమార్ అధికార సభ్యుల హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. ఎక్స్ అఫిషియో హొదాలో కౌన్సిల్ కు హాజరైన ఎమ్మెల్యే యనమల దివ్య చైర్ పర్సన్ నార్ల భువన సుందరి, వైస్ చైర్మన్ అచంట సురేష్ లకు శుభాకాంక్షలు తెలియజేసారు.ఒకే మాటపై నిలబడి చైర్ పర్సన్,వైస్ చైర్మన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్న కౌన్సిలర్లను అభినందించారు. పట్టాభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే యనమల దివ్యను చైర్ పర్సన్ భువన సుందరి సత్కరించారు.కొత్త పురపాలకులను మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు సీనియర్ నేతలు యనమల రాజేష్ చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, మల్ల గణేష్ కుక్కడపు బాలాజీ దంతులూరి శ్రీనివాసరాజు, రామచంద్ర రాజు,పరవాడ తాతబాబు, వెలగా వెంకట కృష్ణారావు తదితరులు అభినందించారు

## ఏపీ బీజేపీకి కొత్త ఛీఫ్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో నాయకత్వ సమస్య ఇబ్బందికరంగా మారినట్లు కనిపిస్తుంది. కేవలం టీడీపీ, జనసేనతో కలసి పోటీ చేయడం వల్లనే ఆ మాత్రం నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచింది. లేకుంటే ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ బలం ఒక్క శాతం ఓట్లు మాత్రమే. అంటే దీనికి ప్రధాన కారణం నాయకత్వ లేమి అని కేంద్ర నాయకత్వం కూడా నిర్ధారణకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటి నుంచే కాదు.. తొలి నుంచి ఈ సమస్య ఉంది. టీడీపీతో జట్టుకడితేనే నాలుగు స్థానాలు సాధించి ఇటు శాసనసభలోనూ, అటు పార్లమెంటులోనూ కమలం పార్టీ అడుగు పెడుతుంది. పేరున్న నేతలున్నప్పటికీ వారు రాష్ట్ర స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయగలవారు ఎవరూ లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని చెప్పకతప్పదు.ఎవరి ప్రభావం... గత ఎన్నికల్లో పురంద్రీశ్వరి పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ ఆమె ప్రభావం పనిచేసింది తక్కువేనని చెప్పాలి. 2019 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసినప్పుడు పురంద్రీశ్వరి ఎన్టీఆర్ కుమార్తె అయినప్పటికీ విశాఖలో ఓటమి పాలయ్యారు. సో.. పురంద్రీశ్వరి అయినా... అంతకు ముందు సోము వీర్రాజు అయినా.. ఆ ముందు కన్నా లక్ష్మీనారాయణ అయినా పార్టీ ఓటు బ్యాంకును పెంచే ప్రయత్నం చేయలేదు. అంటే వారికి అంతా సత్తా లేదు. మోదీ చరిష్మా కూడా ఏపీలో పెద్దగా పనిచేయకపోవడంతో ఇతర పార్టీల పైన ఆధారపడి గెలవాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. సామాజికవర్గాల వారీగా, ఆస్తుల పరంగా చూసినా అంతే. ఏ మాత్రం పనిచేయదన్నది గత కొన్ని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. అయితే ఇప్పుడు పురంద్రీశ్వరిని మార్చాలని కేంద్ర నాయకత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ పదవిని ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు.


# బిజినెస్

## గ్లోబల్ టాప్ 25 క్లబ్‌లోకి రిలయన్స్




ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండిస్టీస్ (ఆర్ఐఎల్) గ్లోబల్ టాప్ 25 విలువైన కంపెనీల్లో ఒక్కటిగా చేరింది. 118 బిలియన్ డాలర్ల నికర విలువ (రూ.10 లక్షల కోట్లు)తో మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్, సౌదీ ఆరామ్కో సరసన చేరింది. చమురు నుంచి టెలికం రంగాల్లో రాణిస్తోన్న ఆర్ఐఎల్ అంతర్జాతీయంగా 21వ అత్యంత విలువైన కంపెనీగా నిలిచిందని బ్లూమ్‌బర్గ్ డాటా వెల్లడించింది. రిలయన్స్ మార్కెట్ కాపిటలైజేషన్ 140 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది టోటల్ ఎస్ఎ, బిపి పిఎల్‌సి కంటే ఎక్కువ. నిఫ్టీ 50లోని 19 కంపెనీల మార్కెట్ విలువతో సమానం. 2024-25 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4) ఫలితాలను రిలయన్స్ ఇండిస్టీస్ శుక్రవారం ప్రకటించింది. కంపెనీ లాభాలు 2.4 శాతం పెరిగి రూ.19,407 కోట్లకు చేరినట్లు తెలిపింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ.5.5 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 2.4 లక్షల కోట్ల నుంచి రూ. 2.6 లక్షల కోట్లకు చేరింది. 2025 మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఆర్ఐఎల్ నికర లాభాలు రూ.69,648 కోట్లకు చేరింది. కంపెనీ నికర విలువ రూ.10 లక్షల కోట్లతో రికార్డు నెలకొల్పింది. గతేడాది ప్రపంచ వ్యాపారం సమస్యాత్మకంగా నిలిచిందని రిలయన్స్ ఇండిస్టీస్ ఛైర్మన్ ముకేష్ అంబానీ అన్నారు. బలహీన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మెరుగైన పనితీరును కనబర్చినట్లు తెలిపారు.


## లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. కానీ ఈ కంపెనీ షేర్లు నష్టాల్లో




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాల్లో ప్రారంభమ య్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ సూచీలు రాణిస్తున్నాయి. సెన్సెక్స్ 130 పాయింట్ల లాభంతో స్టార్ట్ కాగా.. నిఫ్టీ 24,100 దగ్గర మొదలైంది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎంఅండ్ఎం, సన్‌ఫార్మా, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, ఎన్టీపీసీ, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. మార్కెట్ రోజులో ఎగువ స్థాయిలో ట్రేడవుతోంది. నిఫ్టీ 250 పాయింట్లకు పైగా పెరిగింది. బ్యాంక్ నిఫ్టీ దాదాపు 1.5% పెరిగి 750 పాయింట్లు పెరిగింది. మిడ్‌క్యాప్ దాదాపు 1.5% పెరిగింది. సెన్సెక్స్ 1,000 పాయింట్లు పెరిగి 80,200 దాటింది. ఈ క్రమంలో ప్రస్తుతం రిలయన్స్, భారత్ ఎలక్ట్రిక్, సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, జేఎస్‌డబ్ల్యు స్టీల్ వంటి కంపెనీల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉండగా, శ్రీరామ్ ఫైనాన్స్, ఎజూ టెక్, ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉన్నాయి. ఈ రికార్డు పెరుగుదల అనేక ఆర్థిక సూచికలు, షేర్ బాజార్లలో ప్రగతిని సూచిస్తూ, ప్రముఖ రంగాలలో వృద్ధిని చూపిస్తోంది. నికర లాభాలు, పలు కీలక రంగాలలో పాజిటివ్ పనితీరుతో, మ్యూచువల్ ఫండ్స్, ఇన్వెస్టర్ల మధ్య నమ్మకం కూడా పెరిగింది.

# విమానయానం ప్రియం!

## అంతర్జాతీయ రూట్లలో 12 శాతం ఛార్జిల పెంపు



అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారిపై మరింత భారం పెరగనుంది. పహెల్గాం ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో పాక్ ఆ దేశ గగనతలాన్ని మూసివేసింది. దీంతో భారత్‌లో రిజిస్టర్ అయిన అన్ని విమానాలతోపాటు ఇక్కడి యాజమాన్యంలో ఉన్న విమానాలు పాక్ గగనతలం గుండా ప్రయాణించేందుకు అనుమతి లేదు. యూరప్, అమెరికా, మిడిల్‌ఈస్ట్ తదితర దేశాలకు పాక్ గగనతలంపై నుంచి భారత విమాన సర్వీసులు వెళ్లే అవకాశాలు లేకపోవడంతో చుట్టూ తిరిగి ప్రయాణించడంతో వ్యయాలు పెరిగాయి. ఆయా భారాన్ని ప్రయాణికులపై మోపాలని విమాన సంస్థలు నిర్ణయించాయి. దాదాపు 8 శాతం నుంచి 12 శాతం వరకు పెంచనున్నట్లు తెలుస్తోంది. భారత్ నుంచి ఉత్తర అమెరికా, బ్రిటన్, యూరప్ తదితర దేశాలకు వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల సమయం మరింత పెరిగిందని ఇప్పటికే ఎయిర్ ఇండియా, ఇండిగో లాంటి సంస్థలు తమ ప్రయాణికులకు సమాచారం ఇస్తున్నాయి. అమెరికా, యూరోపియన్ దేశాలకు వెళ్లే విమాన ప్రయాణ సమయం 2 గంటల నుంచి 2.5 గంటల వరకు పెరిగిందని ఓ పైలట్ తెలిపారు. దీంతో చమురు, నిర్వహణ వ్యయం పెరగడంతో విమాన ఛార్జీలను పెంచాలని ఆయా సంస్థలు భావిస్తున్నాయన్నారు. ఢిల్లీ, అమృత్‌సర్, జైపూర్, లక్నో, వారణాసి తదితర నగరాల నుంచి ప్రయాణించేవారు అదనపు సమయం వెచ్చించడంతో పాటు అదనపు వ్యయం భరించాల్సి వస్తోందని విమానయాన సంస్థల వర్గాలు పేర్కొన్నాయి. ప్రయాణానికి అదనపు సమయం పట్టడం వల్ల ఇతర దేశాల్లో కనెక్టింగ్ విమానాలు అందుకోవడం కష్టం కావొచ్చు. ఇది కూడా ప్రయాణిలపై భారం పెంచనుంది. కాగా.. భారత విమానాలకు తమ గగనతలాన్ని పాక్ మూసివేయడం ఇదే మొదటిసారి కాదు. బాలాకోట్ వైమానిక దాడుల నేపథ్యంలో 2019 ఫిబ్రవరిలోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తింది.

# భారీగా తగ్గిన బంగారం ధరలు



అక్షయ తృతీయకు ముందు బంగారం ధరల్లో డౌన్ ట్రెండ్ కొనసాగుతోంది.. గత నెల రోజులుగా ఉక్కిరి బిక్కిరి చేస్తున్న బంగారం ధరలు కాస్త ఊరటను ఇచ్చాయి. లక్షను టచ్ చేసి దాటిపోయిన బంగారం ధర గత రెండు రోజులుగా తగ్గుముఖం పడుతుంది. నేడు మరింతగా తగ్గి పసిడి ప్రియులకి భారీ ఊరట కలిగించింది. సోమవారం బంగారం ధరలు భారీగా తగ్గాయి.. అక్షయ తృతీయకు ముందు బంగారం ధరల్లో డౌన్ ట్రెండ్ కొనసాగుతోంది.. గత నెల రోజులుగా ఉక్కిరి బిక్కిరి చేస్తున్న బంగారం ధరలు కాస్త ఊరటను ఇచ్చాయి. లక్షను టచ్ చేసి దాటిపోయిన బంగారం ధర గత రెండు రోజులుగా తగ్గుముఖం పడుతుంది. నేడు మరింతగా తగ్గి పసిడి ప్రియులకి భారీ ఊరట కలిగించింది. సోమవారం బంగారం ధరలు భారీగా తగ్గాయి.. ఆల్‌టైమ్ హై లక్ష నుంచి నుంచి దాదాపు రూ.3,500 వరకు బంగారం ధర తగ్గింది. తాజాగా.. పది గ్రాముల బంగారంపై రూ.700 మేర ధర తగ్గింది. దేశియంగా 22 గ్రాముల బంగారం ధర రూ.89,400 లు ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ.97530గా ఉంది. 22 క్యారెట్లపై రూ.620, 24 క్యారెట్లపై రూ.680 మేర ధర తగ్గింది. వెండి కిలోపై రూ.100 మేర తగ్గి రూ.1,01,800లుగా కొనసాగుతోంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.89,400 లుగా ఉంది.24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.97వేల 530 రూపాయిలుగా ఉంది.మరోవైపు కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.లక్షా 11 వేల 800 రూపాయిలుగా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.89,400 లుగా, 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.97వేల 530 రూపాయిలుగా ఉంది. కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.లక్షా 11 వేల 800 రూపాయిలుగా ఉంది.ఢిల్లీలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,550, 24 క్యారెట్ల ధర రూ.97680 లుగా ఉంది.ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89400, 24 క్యారెట్ల ధర రూ.97530. చెన్నైలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.89400, 24 క్యారెట్ల ధర రూ.97530 లుగా ఉంది. ఢిల్లీలో సిల్వర్ కేజీ ధర రూ.101,800 లు ఉండగా.. ముంబైలో రూ.101,800, చెన్నైలో రూ.1,11,800లుగా ఉంది.

# స్పోర్ట్స్

# ఆర్సీబీ తలరాత మార్చే ప్రయత్నం చేస్తున్న భువీ





ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ తలరాత మార్చే ప్రయత్నం (టైటిల్ సాధించడం) చేస్తున్న వ్యక్తుల్లో భువనేశ్వర్ కుమార్ ముఖ్యుడు. ఈ సీజన్‌లో భువీ ఆడిన ప్రతి మ్యాచ్‌లో సత్తా చాటి ఆర్సీబీ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 9 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీసి లీడింగ్ వికెట్ టేకర్ల జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. తాజాగా (ఏప్రిల్ 27) ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పొదుపుగా బౌలింగ్ చేయడమే (4 ఓవర్లలో 33 పరుగులు) కాకుండా 3 వికెట్లు తీసి ఆర్సీబీ గెలుపులో ముఖ్య భూమిక పోషించాడు. ఈ క్రమంలో ఓ ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో పియూశ్ చావ్లాను (192) వెనక్కు నెట్టి రెండో స్థానానికి ఎగబాకాడు. ప్రస్తుతం భువీ ఖాతాలో 193 వికెట్లు (185 మ్యాచ్‌ల్లో) ఉన్నాయి. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన రికార్డు యుజ్వేంద్ర చహల్ పేరిట ఉంది. చహల్ 169 మ్యాచ్‌ల్లో 214 వికెట్లు తీసి టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు.

ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన టాప్-5 బౌలర్లు
యుజ్వేంద్ర చహల్- 214
భువనేశ్వర్ కుమార్- 193
పియూశ్ చావ్లా- 192
సునీల్ నరైన్- 187
రవిచంద్రన్ అశ్విన్- 185

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో భువీ ప్రదర్శనలు..
సీఎస్‌కేపై 1/20 (ఆర్సీబీ గెలుపు)
గుజరాత్‌పై 1/23 (ఆర్సీబీ ఓటమి)
ముంబై ఇండియన్స్‌పై 1/48 (ఆర్సీబీ గెలుపు)
ఢిల్లీ క్యాపిటల్స్‌పై 2/26 (ఆర్సీబీ ఓటమి)
రాజస్థాన్ రాయల్స్‌పై 1/32 (ఆర్సీబీ గెలుపు)
పంజాబ్ కింగ్స్‌పై 2/26 (ఆర్సీబీ ఓటమి)
పంజాబ్ కింగ్స్‌పై 0/26 (ఆర్సీబీ గెలుపు)
రాజస్థాన్ రాయల్స్‌పై 1/50 (ఆర్సీబీ గెలుపు)
ఢిల్లీ క్యాపిటల్స్‌పై 3/33 (ఆర్సీబీ గెలుపు)

35 ఏళ్ల భువీ ఆర్సీబీకి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్, పూణే వారియర్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. సన్‌రైజర్స్ తరపున విశేషంగా రాణించిన భువీ.. ఆ ఫ్రాంచైజీ తరపున 157 వికెట్లు తీశాడు. మధ్యలో రెండు సీజన్లు పుణేకు ఆడి 31 మ్యాచ్‌ల్లో 24 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం ఆర్సీబీ ఆడుతూ 9 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీశాడు. భువీ తన ఐపీఎల్ కెరీర్‌లో రెండు సార్లు పర్పుల్ క్యాప్ (సీజన్‌లో అ?త్యధిక వికెట్లు) హోల్డర్‌గా నిలిచాడు. 2016, 20167 సీజన్ల వరుసగా ఈ ఫీట్‌ను సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో కేవలం? డ్వేన్ బ్రావో, హర్షల్ పటేల్ మాత్రమే రెండు సార్లు పర్పుల్ క్యాప్ సాధించారు. నిన్న జరిగిన ఢిల్లీ-ఆర్సీబీ మ్యాచ్ విషయానికొస్తే.. భువీతో పాటు హాజిల్‌వుడ్ (4-0-36-2), సుయాశ్ శర్మ (4-0-22-0), కృనాల్ పాండ్యా (4-0-28-1) అద్భుతంగా బౌలింగ్ చేయడంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 162 పరుగుల స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. ఢిల్లీ బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (41), ట్రిస్టన్ స్టబ్స్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన ఆర్సీబీ ఆదిలో తడబడినప్పటికీ (4 ఓవర్లలో 26 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది).. విరాట్ (47 బంతుల్లో 51బీ 4 ఫోరు?), కృనాల్ (47 బంతుల్లో 73 నాటౌట్‌బీ 5 ఫోర్లు, 4 సిక్సర్లు) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌లు ఆడి తమ జట్టును విజయతీరాలకు చేర్చారు. టిమ్ డేవిడ్ (5 బంతుల్లో 19 నాటౌట్‌బీ 3 ఫోర్లు, సిక్స్) ఆఖర్లో వేగంగా ఆడి మ్యాచ్‌ను ముగించాడు. ఆల్‌రౌండ్ షోతో సత్తా చాటిన కృనాల్ పాండ్యాకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ (4-0-19-2), కుల్దీప్ యాదవ్ (4-0-28-0), చమీరా (3-0-24-1) బాగానే బౌలింగ్ చేసినప్పటికీ.. లక్ష్యం మరీ చిన్నది కావడంతో వారు డిఫెండ్ చేసుకోలేకపోయారు. ఆ జట్టు బౌలర్లలో స్టార్క్ (3-0-31-0), ముకేశ్ కుమార్ (3.3-0-51-0) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ఢిల్లీపై గెలుపుతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో 7 విజయాలు సాధించి ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపుగా ఖరారు చేసుకుంది. ఈ సీజన్‌లో ఆర్సీబీ ఇంకా నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. తదుపరి మ్యాచ్‌లో (మే 3) ఈ జట్టు సీఎస్‌కేతో (బెంగళూరులో) తలపడనుంది. మే 9న ఎల్ఎస్‌జీని లక్నోను ఢీకొంటుంది. ఆతర్వాత సన్‌రైజర్స్, కేకేఆర్‌లను బెంగళూరులో ఎదుర్కొంటుంది.

## అదరగొడుతున్నాడు.. అతడిని టీమిండియా టీ20 జట్టులోకి తీసుకోండి



ఐపీఎల్-2025 టీమిండియా స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ అదరగొడుతున్నాడు. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఇప్పటి వరకు ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన ఈ వికెట్ కీపర్ బ్యాటర్ 364 పరుగులు సాధించాడు. 60.66 సగటుతో 146.18 స్ట్రైక్‌రేటుతో మూడు అర్ధ శతకాల సాయంతో రాహుల్ ఈ మేర పరుగులు రాబట్టాడు. ఈ నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ మెంటార్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రాహుల్ ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్నాడని.. అతడిని భారత టీ20 జట్టులోకి తీసుకోవాలని సెలక్టర్లకు సూచించాడు. కాగా ఐపీఎల్-2025లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ ఆదివారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడింది. ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానానికి ప్రమోట్ అయిన రాహుల్.. 39 బంతుల్లో మూడు ఫోర్ల సాయంతో 41 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లంతా విఫలమైన వేళ కాస్త మెరుగ్గా ఆడి.. ఢిల్లీ టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక ఈ మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లో ఎనిమిది వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసిన ఢిల్లీ.. లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. బెంగళూరు జట్టు ఈ టార్గెట్‌ను 18.3 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో బెంగళూరు జట్టు చేతిలో ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడిన పీటర్సన్.. రాహుల్ ఆట తీరు పట్ల మాత్రం సంతృప్తి వ్యక్తం చేశాడు. "టీమిండియా తరఫున టీ20 క్రికెట్‌లో కేఎల్ రాహుల్‌ను నాలుగో స్థానంలో ఆడించాలి. భారత జట్టులో చాలా మంది ఓపెనింగ్ బ్యాటర్లు ఉన్నారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్.. ఇలా ఎవరైనా టాపార్డర్‌లో బ్యాటింగ్ చేయగలరు. అయితే, కేఎల్ రాహుల్ ప్రస్తుతం ఆడుతున్న విధానం అమోఘం. నాలుగో స్థానంలో చక్కగా బ్యాటింగ్ చేయడం సహా.. వికెట్ కీపర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించగలడు. కాబట్టి టీమిండియా నంబర్ ఫోర్ బ్యాటర్, వికెట్ కీపర్‌గా అతడే మొదటి ఎంపిక" అని పీటర్సన్ పేర్కొన్నాడు.

## ఇలా ఒక్కరినే టార్గెట్ చేయడం సరికాదు
## రిషభ్ పంత్ అసహనం!



ఐపీఎల్-2025లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ ఆటగాడిగా పూర్తిగా విఫలమవుతున్నాడు. చెత్త బ్యాటింగ్‌తో విమర్శలు మూటగట్టుకుంటున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అతడు నమోదు చేసిన స్కోర్లు వరుసగా.. 0, 15, 2, 2, 21, 63, 3, 0, 4. 98.21 స్ట్రైక్‌రేటుతో మొత్తంగా కలిపి కేవలం 110 పరుగులు చేశాడు. క్యాష్ రిచ్ లీగ్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా చరిత్రకెక్కిన పంత్ నుంచి ఇలాంటి ఆట తీరు అస్సలు ఊహించనిది. దీంతో అభిమానులు సైతం అతడిపై విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, కెప్టెన్‌గా మాత్రం రిషభ్ పంత్ ప్రదర్శన బాగానే ఉంది. అతడి సారథ్యంలో ఇప్పటి వరకు పది మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న లక్నో ఐదింట గెలిచింది. తాజాగా ఆదివారం నాటి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో ఓడి ఐదో పరాజయం నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఓటమి అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన రిషభ్ పంత్‌కు అతడి ఫామ్ గురించి ప్రశ్న ఎదురైంది. ఇందుకు బదులిస్తూ.. "ఈ విషయం గురించి ఎక్కువగా ఆలోచించకపోవడమే మంచిది. పరిస్థితులు మనకు అనుకూలంగా లేనపుడు మన నైపుణ్యాలపై మనకే సందేహాలు తలెత్తుతాయి. అయితే, అలాంటి భావనలను దరిచేయనీయకూడదు. జట్టు బాగా ఆడుతున్నపుడు.. ఆ విషయంపైనే ఎక్కువగా దృష్టి సారించాలి.

ఒక్కరినే టార్గెట్ చేయడం సరికాదు

క్రికెట్ అంటేనే జట్టుగా ఆడాల్సిన ఆట. అవును.. ఒక్క ఆటగాడి వల్ల కూడా ప్రభావం ఉంటుంది. మ్యాచ్ దిశ మారిపోతుంది. కానీ ప్రతిసారి ఒక్కరినే టార్గెట్ చేయడం సరికాదనుకుంటా" అని పంత్ ఒకింత అసహనం వ్యక్తం చేశాడు. కాగా హార్దిక్ పాండ్యా నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఆదివారం జరిగిన పోరులో ముంబై 54 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ర్యాన్ రికెల్టన్ (32 బంతుల్లో 58బీ 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 54బీ 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం లక్నో 20 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌటైంది.


విల్ జాక్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో

లక్నో ఆటగాళ్లలో ఆయుశ్ బదోని (22 బంతుల్లో 35బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (24 బంతుల్లో 34బీ 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. పంత్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ వచ్చి కేవలం నాలుగు పరుగులే చేసి నిష్క్రమించాడు. విల్ జాక్స్ బౌలింగ్‌లో కర్ణ్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఈ వికెట్ కీపర్ బ్యాటర్ పెవిలియన్ చేరాడు. ఇదిలా ఉంటే.. ముంబౌ బౌలర్లలో బుమ్రా 4, బౌల్ట్ 3 వికెట్లు పడగొట్టగా, ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన విల్ జాక్స్ (29, 2/18) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. కాగా ఐపీఎల్-2025 మెగా వేలంలో లక్నో అత్యధికంగా రూ. 27 కోట్లు ఖర్చు చేసి పంత్‌ను కొనుగోలు చేసి.. కెప్టెన్‌గా నియమించిన విషయం తెలిసిందే.



# పెళ్లెప్పుడో చెప్పిన విశ్వక్ సేన్.. వెయిటింగ్ అంటున్న ఫ్యాన్స్

టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఇతనిని చూస్తే యాటిట్యూడ్ ఎక్కువ అని చాలా మంది అనుకుంటారు. పలు వివాదాలలో కూడా విశ్వక్ యాటిట్యూడ్ చూపించాడు అని కొందరు చెప్పుకొస్తుంటారు. అయితే మంచి టాలెంట్ ఉన్న విశ్వక్ సేన్ ఎందుకో సూపర్ హిట్స్ అందుకోలేకపోతున్నాడు. చివరిగా 'లైలా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఘోర పరాజయం పొందింది. ఈ సినిమా కోసం విశ్వక్ సేన్ చాలా కష్టపడ్డాడు. ప్రమోషన్స్ కూడా గట్టిగానే చేశాడు. అయిన ఫలితం మారలేదు. ఈ సారి మాత్రం గట్టి హిట్ కొట్టాలనే కసి మీద ఉన్నాడు. లైలా సినిమా ఫెయిల్యూర్ తర్వాత విశ్వక్ సేన్ పెద్దగా కనిపించింది లేదు. తాజాగా నేచురల్ స్టార్ నాని నటించిన 'హిట్ 3' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హజరై అదిరిపోయే స్పీచ్ ఇచ్చాడు. హిట్ ఫ్రాంచైజీ ఫస్ట్ పార్ట్‌లో విశ్వక్ సేన్ నటించిన నేపథ్యంలో హిట్ 3 ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఆహ్వానించారు. ఆయన్ను సుమ సరదాగా ఇంటరాగేషన్ చేశారు. ఆఫీసర్‌నే ఇంటరాగేషన్ చేస్తారా? అంటూ సుమను ప్రశ్నించాడు విశ్వక్.. ఇప్పుడు ఆఫీసర్ అర్జున్ సర్కార్ కదా.. అని సుమ అనడంతో దీనికి 'మా తెలంగాణ బ్రాంచ్‌లో నేనే కదా ఆఫీసర్‌ను' అని విశ్వక్ సరదాగా కామెంట్ చేశారు. 'అర్జున్ సర్కార్, విక్రమ్‌లో లేని క్వాలిటీ ఏంటి అని మీరు అనుకుంటున్నారు.' అన్న ప్రశ్నకు విశ్వక్.. 'ఫిట్టింగ్ ఇది. ఇద్దరిలో ఉండే ప్రశాంతత. కామ్ నెస్ అంటూ సమాధానం ఇచ్చారు. ఈ మధ్యే నా వయస్సు 30కి చేరుకుందని , ఇప్పుడు కాస్త స్పీడ్ తగ్గించి కూల్ గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాను. ఊరికే అటు ఇటు పరిగెడుతూ ఉన్నా.. ఇప్పటి నుంచి అది తగ్గిపోతుందని అని చెప్పారు. నాని, అడివి శేష్ నుంచి కూల్ గా ఉండటం నేర్చుకుంటున్నాను అని చెప్పారు. ఇక మీరు పెళ్లెప్పుడు చేసుకోవాలనుకుంటున్నారు?' అని సుమ అడగ్గా.. మా అమ్మకు సంబంధాలు చూడమని మొన్ననే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాను. సో.. ఎప్పుడు దొరికితే అప్పుడు చేసుకుంటాను అని విశ్వక్ చెప్పడంతో త్వరలో మనోడు కూడా పప్పు అన్నం పెట్టించబోతున్నాడని ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు.



# రొమాంటిక్ కామెడీగా 'సింగిల్'

తెలుగు హీరోల్లో శ్రీ విష్ణు కాస్త డిఫరెంట్ మూవీస్ చేస్తూ అలరిస్తుంటాడు. గతేడాది 'స్వాగ్' అనే ప్రయోగాత్మక సినిమా చేశాడు. కానీ ఇది జనాలకు నచ్చలేదు. దీంతో తనకు అచ్చొచ్చిన కామెడీనే మళ్లీ నమ్ముకున్నాడు. అలా చేసిన మూవీ 'సింగిల్'. మే 9న రిలీజ్ కాబోతున్న ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ సినిమా ట్రైలర్ ని తాజాగా రిలీజ్ చేశారు. దీనిబట్టి చూస్తే.. సింగిల్ గా ఉండే శ్రీ విష్ణు జీవితంలోకి ఇద్దరమ్మాయిలు వస్తారు. తర్వాత వాళ్లతో ప్రేమ, రొమాన్స్, గొడవలు.. చివరకు ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తుంది.ల ట్రైలర్ లో కామెడీ బాగుంది. జోకులు బాగానే పేలాయి. చూస్తుంటే శ్రీ విష్ణు మరో హిట్ కొడతాడేమో అనిపిస్తుంది. రీసెంట్ గా వైరల్ అయిన బుల్లిరాజు అలియాస్ రేవంత్ ఈ సినిమాలోనూ నటించాడు. గీతా ఆర్ట్స్ సంస్థ దీన్ని నిర్మించగా.. కార్తీక్ రాజ్ దర్శకుడు. కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లు.



# మరోసారి వార్తలలోకి రాజమౌళి మహాభారతం.. ఆ ముగ్గురు హీరోలు ఫిక్స్ అయినట్టేనా?

భారతీయ సినిమా ముఖ చిత్రాన్ని మార్చేసిన టాలీవుడ్ దర్శకుడు రాజమౌళి. ఆయన కెరీర్‌లో ఒక్కటంటే ఒక్క ఫ్లాప్ లేదు. తీసిన ప్రతి సినిమా సెన్సేషన్. సినిమా సినిమాకి అంచనాలని పెంచేస్తూ హాలీవుడ్ రేంజ్‌లో చిత్రాలు తెరకెక్కిస్తున్నారు జక్కన్న. చివరిగా రాజమౌళి తెరకెక్కించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం తెలుగు సినిమాని ప్రపంచంలో ఇంకా పై స్థాయికి తీసుకెళ్లింది అని చెప్పవచ్చు. ప్రస్తుతం రాజమౌళి.. మహేష్ బాబుతో కలిసి క్రేజీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఈ మూవీ హాలీవుడ్ స్టాండర్డ్స్‌లో ఉంటుందని తెలుస్తుంది. ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి కాగా, మరి కొద్ది రోజులలో రెండో షెడ్యూల్ స్టార్ట్ చేయనున్నాడు. అయితే రాజమౌళి ఎన్ని చిత్రాలు చేసిన ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ ఒకటి ఉంది. అది మరెదో కాదు మహాభారతం. ఎన్నో ఏళ్ళు క్రితమే రాజమౌళి మహాభారత కావ్యాన్ని తెరకెక్కించడం తన జీవిత లక్ష్యం అని చెప్పుకొచ్చారు. ఇది చేయడానికి చాలా సమయం పడుతుందనన్నారు. జక్కన్నకి మన పురాణాలు, ఇతిహాసాలు పట్ల ఉన్న గ్రిప్ ఉండడంతో మహాభారతాన్ని చాలా అద్భుతంగా తెరకెక్కిస్తాడని అందరు అనుకుంటున్నారు. ఆరు సంవత్సరాలు పాటు నాలుగు భాగాలుగా ఈ ప్రాజెక్ట్ చేయనున్నారని, ఇందులో సూపర్ స్టార్స్ భాగం కానున్నారని టాక్స్ వినిపిస్తున్నాయి. రాజమౌళి, మహాభారతం చేస్తే ఇందులో రామ్ చరణ్, ఎన్టీఆర్ ఫిక్స్ అని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఇక తాజాగా మరో నటుడి పేరు కూడా ఫిక్స్ అయింది. హిట్ 3 ది థర్డ్ కేస్ ప్రమోషన్స్‌లో భాగంగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా దర్శక ధీర రాజమౌళితో పాటు హిట్ 1, 2 హీరోలు విశ్వక్ సేన్, అడివి శేష్ గెస్టులుగా హాజరయ్యారు. కలర్‌ఫుల్ గా జరిగిన వేడుకలో యాంకర్ సుమ సరదాగా నిర్వహించిన స్టేజి ఇంటర్వ్యూలో ఒక ఆసక్తికరమైన అప్డేట్ రాబట్టింది. రాజమౌళి డ్రీం ప్రాజెక్టు అయిన మహాభారతంలో నాని క్యారక్టర్ ఫిక్స్ అయిందని రూమర్స్ వస్తున్నాయి. ఇది నిజమేనా అని సుమ ప్రశ్నించింది. దానికి జక్కన్న ఠక్కున బదులిస్తూ నాని డెఫినిట్ గా ఉంటాడని చెప్పడంతో ప్రాంగణంలో ఉన్న ఆడియన్స్ చప్పట్లతో హోరెత్తిపోయింది. పాత్ర ఏంటనేది రివీల్ చేయకపోయిన, జక్కన్న డ్రీమ్ ప్రాజెక్ట్ లో నాని ఉంటాడని తెలియడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఇక నానికి ఏ పాత్ర అయితే బాగుంటుందో అని ఆలోచనలు చేస్తున్నారు.



# నేను కొందరిని బాధపెట్టాను

## శ్రుతి హాసన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్!

శ్రుతి హాసన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. కమల్ హాసన్ వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి వచ్చింది. కెరియర్ తొలినాళ్లలో వరుస ఫెయిల్యూర్స్‌తో ఇబ్బందిపడ్డా.. ఆ తర్వాత వరుస హిట్‌లతో అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. అయితే, శ్రుతి సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితం, లవ్ ఎఫైర్స్, బ్రేక్‌లతో వార్తల్లో నిలుస్తుంది. ప్రేమ వ్యవహారాలు, బ్రేక్‌లపై సైతం ఎలాంటి దాపరికం లేకుండానే స్పందిస్తూ వస్తుంది. ఇటీవల ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గత సంబంధాలతో పాటు వాటి నుంచి నేర్చుకున్న పాఠాలు చేర్చుకున్నానని వ్యాఖ్యానించింది. ఇటీవల ఓ ప్రముఖ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఆమె తన గత సంబంధాలు, వాటి వల్ల నేర్చుకున్న పాఠాలు, పశ్చాత్తాపంపై కీలక వ్యాఖ్యలు చేసింది. కొంతమంది చాలా విలువైన వ్యక్తులను బాధపెట్టానని.. అలా చేసి ఉండాల్సి కాదని అనిపిస్తుందని చెప్పింది. దానిపై ప్రస్తుతం బాధపడుతూ.. క్షమాపణలు కోరుంటానని తెలిపింది. మిగతా విషయాల్లో తనకు ఎలాంటి రిగ్రెట్స్ లేవని.. పలుసార్లు సరదాగా, అనాలోచితంగా ప్రవర్తించినా ఇతరులను బాధపెట్టడం మాత్రం బాధ కలిగిస్తుందని పేర్కొంది. తన లవర్ ఎఫైర్స్, బ్రేక్‌లపై స్పందిస్తూ.. అందరి జీవితంలో ఓ ప్రమాదకరమైన మాజీ ప్రేమికుడు ఉంటాడని.. అది తప్ప మిగతా బంధాలను ఎలాంటి పశ్చాత్తాపం లేకుండానే ముగించినట్లు చెప్పింది. తనను చాలామంది ఇతను ఎన్నో బాయ్‌ఫ్రెండ్ అని ప్రశ్నిస్తుంటారని.. వారికి అది కేవలం ఒక నెంబర్ మాత్రమేనని.. తాను మాత్రం కోరుకున్న పొందడంలో విఫలమయ్యాదన్న దానికి గుర్తు మాత్రమేనని.. దాన్ని గురించి సిగ్గుపడనని, మనిషిగా కొంచెం బాధగా ఉంటుందని తెలిపింది.



# అల్లు అర్జున్- అట్లీ ప్రాజెక్ట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్న క్రేజీ హీరోయిన్

తెలుగు చిత్రం సీతారామంతో వెలుగులోకి వచ్చిన నటి మృణాల్ ఠాకూర్. అంతకుముందు హిందీ, మరాఠీ తదితర చిత్రాల్లో నటించారు. అయితే సీతారామం చిత్రం ఈమెని తెలుగులో స్టార్ హీరోయిన్‌ను చేసింది. అంతేకాకుండా తమిళం లోను పాపులర్ చేసింది. ఆమె నటించిన మరో చిత్రం హాయ్ నాన్న. నాని కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన నటించిన ఫ్యామిలీ స్టార్ చిత్రం నిరాశ పచడంతో క్రేజ్ ఒకసారిగా తగ్గిపోయింది. దీంతో అవకాశాలు కూడా మొఖం దాటేసాయి. అదేవిధంగా హిందీలో లస్ట్ స్టోరీస్ చిత్రంలో మెప్పించిన ఈ బ్యూటీ తెలుగులో అడివి శేష్ చిత్రం డెకాయిట్‌లో నటిస్తున్నారు. తాజాగా ప్రభాస్‌కు జతగా స్పిరిట్ చిత్రంలో నటించే అవకాశం తలుపు తట్టిందనే ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ అమ్మడికి మరో లక్కీ సాంగ్స్ వరించిందని తాజాగా సామాజి మాధ్యమాల్లో ప్రచారం వైరల్ అవుతోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప%-% 2 చిత్రంతో పాన్ ఇండియా మార్కెట్‌నే మార్చేశారు. ఆయనకు డైరెక్ట్‌గా కోలీవుడ్‌లో ఒక చిత్రం చేయాలన్న కోరిక చాలాకాలంగా ఉంది. అలా లింగు స్వామి దర్శకత్వంలో చిత్రం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. అయితే, కారణాలు ఏమైనా ఆ చిత్రం సెట్ పైకి వెళ్లలేదు. అలాంటిది తాజాగా అట్లీ దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం చేయడానికి అల్లు అర్జున్ సిద్ధమయ్యారు. అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో భారీ బడ్జెట్లో రూపొందుతున్న ఈ చిత్రంలో ముగ్గురు కథానాయకలు ఉంటారని సమాచారం. అందుకోసం జాన్వీ కపూర్, శ్రద్ధా కపూర్, దిశా పటానితో చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తాజాగా ఈ లిస్టులో నటి మణాల్ ఠాగూర్ ముందు వరుసలో చేరినట్లు తెలిసింది. ఈమె ఈ క్రేజీ చిత్రంలో నటించడం దాదాపు ఖరారు అయినట్టు, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com